Follow: @ANNTELUGU
12-03-2025
ANN తెలుగు
మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 100 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



# నేటి నుండి అసెంబ్లీ సమావేశాలు

## నెలాఖరువరకు కొనసాగే అవకాశం

హైదరాబాద్, మహా: రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి అసెంబ్లీ లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రసంగిస్తారు. అనంతరం సమావేశాల ఎజెండా ఖరారుకు బీఏసీ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో అసెంబ్లీ ఎన్ని రోజులు, ఏ అంశాలపై చర్చించనున్నారో ఖరారు కానుంది. బడ్జెట్ సమావేశాలు ఈనెలాఖరు వరకు కొనసాగే అవకాశం ఉంది. 13న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. హోలీ నేపథ్యంలో తర్వాత సెలవులిచ్చారు. ఈనెల 17, 18 తేదీల్లో బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణను ఆమోదిస్తూ తీర్మానం చేయనున్నారు. ఈనెల 19న బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉందని సమాచారం. ఈ నెలాఖరు వరకు సభ జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా బడ్జెట్‌తో పాటుగా ఎస్సీ వర్గీకరణ, బీసీలకు రిజర్వేషన్‌లు 42 శాతం అమలుచేస్తూ తీర్మాణమే ప్రధానంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ అసెంబ్లీ సమావేశాలకు ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ హాజరుకానున్నారు. తాను సమావేశాలకు వస్తానని కేసీఆరే స్వయంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత సమావేశాలు ఆసక్తికరంగా సాగే అవకాశాలున్నాయి.

**టాప్ న్యూస్**

తమిళనాడుపై నాగ్‌పూర్

## పెత్తనం చెల్లదు




- త్రిభాషా సిద్ధాంతంపై సీఎం స్టాలిన్ ఫైర్
- పార్లమెంట్ లో డీఎంకే ఎంపీలు వీరోచితంగా పోరాడుతున్నారు
- కేంద్రం బెదిరింపులకు లొంగే ప్రసక్తే లేదు

02

దక్షిణాది రాష్ట్రాలకు

## అన్యాయం జరుగదు



- నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదిలోనూ సీట్లు పెరుగుతాయి
- కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్

02

సింగరేణిలో కొత్త

## పవర్ ప్లాంట్



- ఏటా మరో రూ.300 కోట్ల లాభాలు
- బీహెచ్ఈఎల్‌తో కీలక ఒప్పందం
- సీఎండీ కీలక ప్రకటన

03



# అందరికీ న్యాయం సామాజిక ధ్యేయం

## నామినేటెడ్ పదవుల్లో రేవంత్ మార్క్

పది పదవులు.. పది వర్గాలు.. కాంగ్రెస్ బ్రాండ్

గౌడ్, యాదవ్, మైనారిటీ, లంబడా, కమ్మ, మున్నూరు కాపు, మాల తదితర వర్గాలకు అవకాశాలు

హైదరాబాద్, మహా: కాంగ్రెస్ ను సకలవర్గాలు అక్కున చేర్చుకునేలా.. నామినేటెడ్ పదవుల్లో భిన్నవర్గాలకు చోటు కల్పిస్తోంది. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటినుండీ నామినేటెడ్ ఎమ్మెల్సీలు, రాజ్యసభల్లో ఒక్కో వర్గానికి ఒక్కో పదవి కట్టబెడుతూ సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాటిచెబుతున్నారు. పోటీలేకుండా గెలిచే స్థానాలన్నీ ఒక్కో వర్గానికి కట్టబెడుతూ ప్రాతినిధ్యం దక్కనివర్గాలకు చట్టసభల్లోకి వెళ్ళే ఛాన్స్ ఇస్తున్నారు.

మిగతా 2లో

**రాజ్యసభ**



అనిల్ కుమార్ **బీసీ**



రేణుకా చౌదరి **కమ్మ**




| ఎమ్మెల్సీ | ఎమ్మెల్సీ | ఎమ్మెల్సీ | ఎమ్మెల్సీ | ఎమ్మెల్సీ | ఎమ్మెల్సీ | ఎమ్మెల్సీ | ఎమ్మెల్సీ |
|---|---|---|---|---|---|---|---|
| కోదండ రాం | అమీర్ అలీ ఖాన్ | అద్దంకి దయాకర్ | శంకర్ నాయక్ | విజయశాంతి | వెంకట్ బల్మూర్ | తీన్మార్ మల్లన్న | మహేష్ కుమార్ |
| రెడ్డి | ముస్లిం | ఎస్సీ | ఎస్టీ | బీసీ | వెలమ | మున్నూర్ కాపు | గౌడ్ |



## ఫొటో గ్రాఫర్‌ను మెచ్చిన రాహుల్

### పార్లమెంట్ కాంప్లెక్స్‌లో సర్ ప్రైజ్

మహా : షిప్రా దాస్ పార్లమెంట్ లో అత్యంత పాత ఫోటోగ్రాఫర్ మంగళవారం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ని పార్లమెంట్ కాంప్లెక్స్‌లో ఫోటో తీస్తూ ఉండగా రాహుల్ గాంధీ ఆమె వద్దకు వచ్చి ఆమె కృషిని, పనిని మెచ్చుకున్నారు. రాహులే తన వద్దకు వచ్చి ఆత్మీయంగా దగ్గరకు తీయడంతో ఆమె సంతోషానికి అవధులు లేవు.



తెలంగాణ గ్రూప్ 2లో

## సత్తా చాటిన అబ్బాయిలు

### టాప్ ర్యాంకులన్నీ వారివే!

హైదరాబాద్, మహా : తెలంగాణ గ్రూప్ 2 ఫలితాలను టీజీపీఎస్సీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేశారు. మొత్తం 783 గ్రూప్ 2 పోస్టులకు సంబంధించి జనరల్ ర్యాంకులను కమిషన్ ప్రకటించింది. మొత్తం 4 పేపర్లకు గ్రూప్ 2 పరీక్ష జరగగా.. ఫలితాలతోపాటు ఆన్సర్ కీలను కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఇక తాజా ఫలితాల్లో పురుష అభ్యర్థులు సత్తా చాటారు.

వివరాలు 2లో



## ప్రాణం తీసిన సరదా

- గండిపేటలో ఎంజిబిటి ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం
- మరో ఐదుగురు బీటెక్ విద్యార్థులకు తీవ్రగాయాలు

వివరాలు 2లో

## దేశానికి రోల్ మోడల్‌గా కొండపర్తి నిలవాలి

- మహిళల అభివృద్ధికి చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు కావాల్సి ఉంది
- ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధికి కృషి
- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- కొండపర్తిలో కొమురం భీం, బిర్సాముండా విగ్రహాల ఆవిష్కరణ
- మంత్రి సీతక్కతో కలిసి డిజిటల్ క్లాసులు, అంగన్‌వాడీ కేంద్రం, మసాలా, కుట్టుమిషన్ యూనిట్ల ప్రారంభం
- మేడారం సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు



ములుగు, మహా : ములుగు జిల్లా ప్రకృతి అందాల మేళవింపు అని, తాడ్వాయి మండలంలోని కొండపర్తి గ్రామం దేశానికి రోల్ మోడల్ గా నిలవాలని తెలంగాణ రాష్ట్రగవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గ్రామంలోని మహిళల ఆర్థిక అభివృద్ధికి చిన్నచిన్న పరిశ్రమలను ఏర్పాటు చేయాల్సి ఉందని ఆకాంక్షించారు. ఆదివాసీ, గిరిజను అభివృద్ధికి తనతోపాటు మంత్రి, ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.


మిగతా 2లో

## రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల

### రైతులు, అధికారులు, శాస్త్రవేత్తలతో మాట్లాడిన మంత్రి

**పొలం నుండి రైతులు నేరుగా మాట్లాడే అవకాశం**

**వ్యవసాయ యాంత్రీకరణలో చిన్న, సన్న కారు రైతులకు ప్రాధాన్యత**



మహా : ప్రస్తుత పరిస్థితులలో నీటి ఎద్దడిని తట్టుకోవడానికి రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి, రాజేంద్రనగర్ వరిపరిశోధన స్థానం నుంచి శాస్త్రవేత్తలు ప్రత్యక్షంగా రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో ఆరుతడి పద్ధతిలో వరి పంటకు నీరు అందించాలని, దీనివల్ల నీటి ఎద్దడిని అధిగమించడంతో పాటు, అధిక దిగుబడులు కూడా సాధించడానికి అవకాశం ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు వివరించారు.

మిగతా 2లో

## బలహీనవర్గాలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం

### ఆరెకటిక మహాసభలో టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్



హైదరాబాద్, మహా: బలహీనవర్గాలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర ఆరె కటిక మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఆరె కటికల పాత్ర ఉందని, బడుగు బలహీనర్గాలకు న్యాయం జరగాలని రాహుల్ గాంధీ

మిగతా 2లో

## అసెంబ్లీ సమావేశాలకు వస్తున్నా..

### ప్రజా సమస్యలపై రాజీలేని పోరు చేద్దాం

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కేసీఆర్ పిలుపు**



హైదరాబాద్: తెలంగాణ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ఎల్పీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పలు అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పార్టీ శాసన సభ, మండలి సభ్యులందరూ నిర్ణీత సమయానికి సభకు హాజరుకావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై చీల్చి చెండాడాలన్నారు. బీఆర్ఎస్‌పై ప్రభుత్వం చేస్తున్న తప్పుడు నిందలను తిప్పి కొట్టాలన్నారు. ఈ సారి సభకు తాను కూడా వస్తున్నానని చెప్పారు.

మిగతా 2లో



హైదరాబాద్ టూ మచిలీపట్నం

## నేషనల్ హైవే

### త్వరలోనే టెండర్లు

- ట్రిబుల్ ఆర్ కు రెండు నెలల్లో అన్ని అనుమతులు
- మంత్రి కోమటిరెడ్డికి హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

02



## తమిళనాడుపై నాగ్‌పూర్ పెత్తనం చెల్లదు

- త్రిభాషా సిద్ధాంతంపై సీఎం స్టాలిన్ ఫైర్
- పార్లమెంట్ లో డీఎంకే ఎంపీలు వీరోచితంగా పోరాడుతున్నారు
- కేంద్రం బెదిరింపులకు లొంగే ప్రసక్తే లేదు

**మహా:** నూతన విద్యా విధానం.. త్రిభాషా సిద్ధాంతంపై తమిళనాడు సీఎం స్టాలిన్ మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా రాష్ట్రంలో త్రిభాషా సిద్ధాంతాన్ని అమలు చేసే ప్రసక్తే లేదన్నారు. నాగ్‌పూర్ నుంచి వచ్చే ఆదేశాలను తమిళనాడులో అమలు చేయబోమని ప్రకటించారు. కొత్త విద్యా విధానం పేరుతో హిందీని తమపై బలవంతంగా రుద్దేందుకు ఆర్ఎస్ఎస్ కుట్ర చేసిందన్నారు. పార్లమెంట్ లో త్రిభాషా సిద్ధాంతానికి వ్యతిరేకంగా డీఎంకే ఎంపీలు వీరోచితంగా పోరాడుతున్నారని స్టాలిన్ అభినందించారు. కేంద్రం బెదిరింపులకు లొంగే ప్రసక్తే లేదన్నారు. తమిళనాడు ఎంపీలపై కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, చేసిన వ్యాఖ్యలను స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. మరోవైపు త్రిభాషా సిద్ధాంతానికి వ్యతిరేకంగా డీఎంకే ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేపట్టారు. తమిళనాడును అవమానించిన కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నల్లదుస్తులు ధరించి డీఎంకే ఎంపీలు ఆందోళన చేశారు. అయితే డీఎంకే ఎంపీల తీరును కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్రంగా తప్పుపట్టారు. ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలకు డీఎంకే ఎంపీలు లోక్‌సభలో తీవ్ర నిరసన తెలిపారు . తాము ముమ్మాటికి త్రిభాషా సిద్ధాంతానికి వ్యతిరేకమని ఎంపీ కనిమొళి అన్నారు.

# అందరికీ న్యాయం.. సామాజిక న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

బిసి కులగణనతో దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయని సాహసం చేసిన రేవంత్ రెడ్డి నామినేటెడ్ పదవుల పంపిణీలో సామాజిక న్యాయసూత్రాన్ని పాటిస్తున్నారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ హైకమాండ్ నామినేటెడ్ పదవుల్లో అన్ని వర్గాలకు చోటు కల్పించాలన్న యోచనతో ఉండగా, సీఎం ఆచరణలో చేసి చూపిస్తున్నారు. మహిళాభ్యున్నతిలోనూ తెలంగాణ ప్రభుత్వం దూకుడుగా పథకాలు అమలుచేస్తున్నది. ఆర్టీసీ బస్సులో ఉచితప్రయాణం, ఇందిరా మహిళాశక్తి ద్వారా మహిళలకు అద్దెబస్సుల కాంట్రాక్టు ఇవ్వడం, మహిళలకు పెట్రోల్ బంకులు ఇవ్వడం వంటి కార్యక్రమాలతో.. సీఎం రేవంత్ మహిళాపక్షపాతిగా ప్రశంసలందుకుంటున్నారు. ఫైర్ బ్రాండ్ మినిస్టర్ సీతక్క మహిళాశిశుసంక్షేమ శాఖా మంత్రిగా పథకాల అమలులో, సంక్షేమంలో శాఖపై పట్టు బిగించి పనులు పరుగులు తీయిస్తున్నారు.

**భిన్నవర్గాలు.. విభిన్న కోణాలు**

కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చిన పదిమాసాల్లో చట్టసభల్లో నామినేట్ చేసేందుకు వచ్చిన అవకాశాలు పరిశీలిస్తే ఆ మార్క్ కనిపిస్తుంది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొట్టమొదటగా రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీ అయ్యాయి. వీటిలో ఒకటి బిసి యాదవ సామాజిక వర్గానికి చెందిన అనిల్ కుమార్ యాదవ్ కు అప్పగించింది. మరొకటి కమ్మ సామాజిక వర్గానికి చెందిన రేణుకా చౌదరికి ఇచ్చింది. తర్వాత ఎమ్మెల్యే కోటాలో రెండు స్థానాలు ఖాళీ కాగా ఒకటి బిసి గౌడ సామాజిక వర్గానికి చెందిన మహేష్ కుమార్ గౌడ్ కు, మరొకటి వెలమ సామాజిక వర్గానికి చెందిన బల్మూరి వెంకట్ కు ఇచ్చింది. తర్వాత గవర్నర్ కోటాలో మరో రెండు స్థానాలు ఖాళీ కాగా, తెలంగాణ ఉద్యమరథసారథి, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్ కోదండరాంకు, మైనారిటీ వర్గానికి చెందిన అమీర్ అలీ ఖాన్ కు ఛాన్స్ ఇచ్చింది. తాజాగా కాంగ్రెస్ పార్టీ మూడు ఎమ్మెల్సీలను ఎంపిక చేయగా, ఇందులో ఎస్టీ లంబడా సామాజిక వర్గానికి చెందిన శంకర్ నాయక్, ఎస్సీ మాల వర్గానికి చెందిన అద్దంకి దయాకర్ కు, బిసి వర్గానికి చెందిన విజయశాంతికి ఛాన్స్ లభించింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలోనూ బిసి మున్నూరుకాపు వర్గానికి చెందిన తీన్మార్ మల్లన్నకు ఛాన్స్ ఇచ్చింది. సిపిఐ నుండి కూడా బిసికే ఎమ్మెల్సీ ఇవ్వాలని సూచించి.. సామాజిక న్యాయసూత్రాన్ని కాంగ్రెస్ పాటించింది. కాంగ్రెస్ ఇప్పటిదాకా ఇచ్చిన పది పదవులు.. పది వర్గాలకు దక్కగా, భవిష్యత్తులో ఇవ్వబోయే చట్టసభల నామినేటెడ్ పదవుల్లో ఇదే సూత్రం పాటిస్తామని చెబుతోంది. భవిష్యత్తులో మహిళలకు మరిన్ని అవకాశాలు దక్కే అవకాశాలు ఉన్నాయి. ప్రజాక్షేత్రంలో పోటీచేసే స్థానాలకు స్థానిక పరిస్థితులు, వనరులు, ప్రత్యర్ధిని బట్టి నిర్ణయం తీసుకోనుండగా.. నామినేటెడ్ పదవుల్లో మాత్రం సామాజిక న్యాయం పాటించాల్సిందేనన్న పట్టుదలతో కాంగ్రెస్ పార్టీ ఉంది.



## హైదరాబాద్ టూ మచిలీపట్నం నేషనల్ హైవే
### త్వరలోనే టెండర్లు
**ట్రిబుల్ ఆర్ కు రెండు నెలల్లో అన్ని అనుమతులు**
**మంత్రి కోమటిరెడ్డికి హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ**

**మహా :** హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కనెక్ట్ చేసేలా పలు మార్గాల్లో నేషనల్ హైవేలు నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టు విషయమై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం కలిశారు. ఈ మేరకు.. పలు ప్రాజెక్టుల గురించి చర్చించారు. ఈ క్రమంలోనే.. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టుపై నితిన్ గడ్కరీ కీలక ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. రాష్ట్రంలోని రహదారులతో పాటు పక్కనున్న పొరుగు రాష్ట్రాలను కలిపే హైవేలను కూడా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే పలు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పెండింగ్‌లో ఉన్న పలు నేషనల్ హైవేల గురించి కూడా కేంద్రంపై ఒత్తిడి పెడుతోంది. ఈ మేరకు ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా కేంద్ర మంత్రులను కలుస్తూ విజ్ఞప్తులు చేస్తూ, లేఖలు సమర్పిస్తున్నారు మంత్రులు. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తుల మేరకు కేంద్రం కూడా తెలంగాణలోని పలు నేషనల్ హైవేలపై దృష్టి సారించింది. ఈ క్రమంలోనే.. ఆలస్యమవుతున్న హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు రోడ్డు విస్తరణ పనులపై ఫోకస్ పెట్టినట్టు తెలుస్తోంది. ఈ మేరకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక ప్రకటన చేశారు.


ఢిల్లీ పర్యటనలో ఉన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశం తర్వాత.. మీడియా సమావేశం నిర్వహించారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు సంబంధించిన అన్ని అనుమతులు రెండు నెలల్లో ఇస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చినట్టు కోమటిరెడ్డి తెలిపారు. అన్ని క్లియరెన్స్‌లు వచ్చిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్తామని మాట ఇచ్చినట్టు చెప్పుకొచ్చారు. మరోవైపు.. సంగారెడ్డి భువనగిరి చౌటుప్పల్ వరకు ఆర్ఆర్ఆర్ టెండర్ల ప్రక్రియ పూర్తయిందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. సుమారు 95 శాతం భూసేకరణ కూడా పూర్తనట్టు వెల్లడించారు. వెయ్యి కోట్ల రూపాయలతో 12 ఆర్వోబీలు కూడా మంజూరు చేసినట్టు స్పష్టం చేశారు. మరోవైపు హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి ఆరు లేన్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని నితిన్ గడ్కరీ ఆదేశించినట్టు తెలిపారు.

వీటితో పాటు.. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు రోడ్డు విస్తరణ ప్రాజెక్టు పెండింగ్ పడుతూ వస్తున్న నేపథ్యంలో.. నితిన్ గడ్కరీ కీలక ఆదేశాలు చేసినట్టు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. గుడిమల్కాపూర్ నుంచి విజయవాడ వరకు ఒక ప్యాకేజీ విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు మరో ప్యాకేజీగా విభజించి టెండర్లు పిలవాలని అధికారులను నితిన్ గడ్కరీ ఆదేశించినట్టు వెల్లడించారు. ఈ ప్రక్రియతో పనులు త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. మరోవైపు.. 62 కిలో మీటర్ల మేర శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని కేంద్ర మంత్రి చెప్పినట్టుగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వివరించారు.

## బలహీనవర్గాలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

భారత్ జోడోయాత్ర చేపట్టారన్నారు. బలహీన వర్గాలకు అభివృద్ధి ఫలాలు అందాలని కుల సర్వే జరగాలనేది రాహుల్ గాంధీ ఆశమన్నారు. కుల సర్వే తో బీసీల గుండెల్లో రాహుల్ గాంధీ చిర స్థాయిగా నిలిచిపోతారన్నారు. రాహుల్ గాంధీ ఆశయం మేరకు రేవంత్ ప్రభుత్వం కుల గణన సర్వే నిర్వహించిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఆరె కటికలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యేలుగా పోటీ చేసే స్థాయికి ఆరె కటికలు ఎదగాలన్నారు. భవిష్యత్ తెలంగాణ బీసీలదేనన్నారు. 42 శాతం రిజర్వేషన్ల చట్ట బద్ధత కోసం స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయడం జరిగిందన్నారు. తెలంగాణ బీజేపీ నేతలకు దమ్ము ధైర్యం ఉంటే కుల సర్వేకు మద్దతు ఇవ్వాలని కేంద్రాన్ని అడగగలరా? దేశ వ్యాప్తంగా జన గణన తో పాటు కుల సర్వే చేయాలని అడిగే ధైర్యం బండి సంజయ్ కి ఉందా? అని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి,కార్పొరేషన్ చైర్మన్లు, మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగదు


- నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదిలోనూ సీట్లు పెరుగుతాయి
- కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్

మహా : నియోజకవర్గాల పునర్విభజన ప్రణాళికా బద్ధంగా ఉంటుందని, తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాలలో సీట్లు పెరుగుతాయని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. అభ్యంతరాలు ఉంటే ఆ అంశాలను స్టాలిన్ లేవనెత్తవచ్చని, నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే వాదనలో నిజం లేదన్నారు. తమిళనాడు సహా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళలో కూడా సీట్ల సంఖ్య పెరుగుతుందని ఆయన అన్నారు. పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని తమిళనాడు, తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పార్లమెంటులో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గుతుందని స్టాలిన్ అంటున్న నేపథ్యంలో రాజ్ నాథ్ సింగ్ స్పందించారు. సంబంధిత అధికారులు చర్చ జరుపుతారని, నిర్ణయం న్యాయంగా ఉంటుందన్నారు. శాసన సభ లేదా లోక్ సభ ఏదైనా నియోజకవర్గాల పునర్విభజన తర్వాత సీట్ల సంఖ్య పెరగడం సహజమే అన్నారు.

## ప్రాణం తీసిన సరదా

- గండిపేటలో ఎంజిఐటి ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం
- మరో ఐదుగురు బీటెక్ విద్యార్థులకు తీవ్రగాయాలు

**గండిపేట, మహా:** సరదా ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. తోటి స్నేహితులతో కలిసి కారులో వెళ్తున్న ఇంజనీరింగ్ విద్యార్థి అతివేగం కారణంగా దుర్మరణం చెందాడు. వాహనాన్ని వేగంగా నడపడంతో అది అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం చెందగా.. మరో ఐదుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకివెళ్తే.. హైదరాబాద్ నగరంలోని గండిపేటలోని ఎంజీఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆరుగురు విద్యార్థులు మంగళవారం సాయంత్రం TS08BEG4929 నెంబర్ గల స్విఫ్ట్ కార్‌లో కళాశాల నుంచి ఇంటికి బయల్దేరారు. అయితే నియో పోలీస్ సమీపంలోని రాజపుష్ప కన్‌స్ట్రక్షన్ సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి.. వేగంగా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న శ్రీకర్ (18) అనే విద్యార్థి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అదే వాహనంలోని హేమ సాయి (19), వివేక్ (19), సృజన (18), కార్తికేయ (18), హర్ష (19) అనే ఐదురుగు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో హర్ష సాయి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న



పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. శ్రీకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అతివేగమే నిండు ప్రాణాన్ని బలిగొన్నందని, ఎన్నిసార్లు హెచ్చరించినా యువత వేగంగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారనీ నార్సింగి పోలీసులు పేర్కొన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా అధ్యాపకులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకరించాలని పోలీసులు కోరారు. కాగా తాజా ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల

(మొదటి పేజీ తరువాయి)

స్వల్పకాలిక రకాలను నవంబర్ లోనే సాగును ప్రారంభించినట్లయితే మార్చి మొదటి వారం వరకు వరికోతకు రావడానికి అవకాశం ఉంటుందని, ఈ విషయాన్ని గ్రహించి రైతులు ముందస్తు ప్రణాళికతో సాగుచేయాల్సిన అవసరం ఉందని, తద్వారా నీటి ఎద్దడిని అధికమించడంతో పాటు, వడగళ్ల వర్షం వంటి విపత్తుల నుండి కూడా వరి పంటను రక్షించుకోవడానికి వీలుకలుగుతుందని ఈ సందర్భంగా మంత్రివర్యులు పేర్కొన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా చిన్న, సన్నకారు రైతులకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి, పవర్ టిల్లర్స్, పవర్ వీడర్, రోటోవేటర్, ట్రాక్టర్ తో నడిపే పరికరాలు, తైవాన్ స్ప్రేయర్స్ మొదలైన వ్యవసాయ పనిముట్లను సబ్సిడి మీద వెంటనే రైతులకు అందించుటకు తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ యాస్మిన్ బాషకు మంత్రి సూచించారు. గత 5 సంవత్సరాలలో టీజీ సీడ్స్ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో సంస్థ నష్టాల్లోకి వెళ్లిందని, ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం సంస్థ ద్వారా ఉత్పత్తి చేసిన సీడ్స్ ని అంతా రైతులకు సరసమైన ధరలో అందించగలిగామని, గత 5 సంవత్సరాలలో సీడ్స్ ని నాన్ సీడ్స్ గా అమ్మినందుకే దాదాపు 90 కోట్లు నష్టం వచ్చిందని తెలిపారు. సీడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ద్వారా నాణ్యమైన సన్నరకాల విత్తనాలను రైతులకు అందించేందుకు తగుచర్యలు తీసుకోవాలని డైరెక్టర్ కు సూచించారు. కందులు, మినుములు, సన్ ఫ్లవర్, శనగలు మొదలైన పంటల విషయంలో నాణ్యమైన విత్తనాలను సీడ్ కార్పోరేషన్ ద్వారా అందించాలన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా నిర్వహించబడుతున్న జిన్నింగ్ మిల్లు గత నాలుగు సంవత్సరాలుగా ఉపయోగంలో లేదని, ఈ సంవత్సరం దాని జిన్నింగ్ పనిని ఆరంభించమని మంత్రి ఆదేశించారు. మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఉన్న గోదాములు 100 శాతం పూర్తిస్థాయిలో వినియోగంలో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మద్ధతు ధరతో కొనుగోలు చేస్తున్న కందులు, శనగలు, వేరుశనగ, పొద్దు తిరుగుడు మొదలైన పంటల కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ రఘునందన్ రావు, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, సీడ్ కార్పోరేషన్ ఎండి యాస్మిన్ బాషా, సీడ్ సర్టిఫికేషన్ ఎండి కేశవులు, మార్క్ ఫెడ్ ఎండి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గ్రూప్ 2లో సత్తా చాటిన అబ్బాయిలు
### టాప్ ర్యాంకులన్నీ వారివే!

(మొదటి పేజీ తరువాయి)

ఈసారి టాప్ టెన్ ర్యాంకులన్నీ పురుషులవే కావడం విశేషం. ఏకంగా టాప్ 31వ ర్యాంకు వరకు అందరూ పురుష అభ్యర్థులే ఉన్నారు. నారు వెంకట హరవర్ధన్ (ఓసీ) అనే అభ్యర్థి 447.088 మార్కులతో టాప్ ర్యాంకు సొంతం చేసుకున్నాడు. ఆ తర్వాత వడ్లకొండ సచిన్ (ఓసీ) అనే అభ్యర్థి 444.754 మార్కులతో సెకండ్ ర్యాంకు, బీ మనోహర్ రావు (బీసీడీ) అనే అభ్యర్థి 439.344 మార్కులతో మూడో ర్యాంకు కైవసం చేసుకున్నారు. ఇక లక్కిరెడ్డి వినిషా రెడ్డి అనే మహిళా అభ్యర్థికి 32వ ర్యాంకు వరించింది. వినిషా రెడ్డికి 408 మార్కులు వచ్చాయి. ఇక టాప్ టెన్ అభ్యర్థుల్లో ఐదుగురు ఓసీలు, మిగతా ఐదుగురు బీసీ కేటగిరికి చెందిన అభ్యర్థులు ఉన్నారు. టాప్ 50లో ఇద్దరు ఎస్టీలు మాత్రమే ఉన్నారు.

**టీజీపీఎస్సీ గ్రూప్ 2 టాప్ 10 ర్యాంకర్లు వీరే**

నారు వెంకట హరవర్ధన్ (ఓసీ) 447.088 ఫస్ట్ ర్యాంకు
వడ్లకొండ సచిన్ (ఓసీ) 444.754 సెకండ్ ర్యాంకు
బీ మనోహర్ రావు (బీసీడీ) 439.344 మూడో ర్యాంకు
శ్రీరామ్ మధు (బీసీబీ) 438.972 నాల్గవ ర్యాంకు
చింతపల్లి ప్రీతమ్ రెడ్డి (ఓసీ) 431.102 ఐదవ ర్యాంకు
అఖిల్ ఎర్ర (ఓసీ) 430.807 ఆరవ ర్యాంకు
గొర్లేటి అశోక్ (బీసీబీ) 425.842 ఏడో ర్యాంకు
చిమ్ముల రాజశేఖర్ (ఓసీ) 423.933 ఎనిమిదో ర్యాంకు
మేకల ఉపేందర్ (బీసీడీ) 423.119 తొమ్మిదో ర్యాంకు
కరింగు నరేశ్ (బీసీబీ) 422.989 పదో ర్యాంకు

## అసెంబ్లీ సమావేశాలకు వస్తున్నా..
### ప్రజా సమస్యలపై రాజీలేని పోరు చేద్దాం
**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కేసీఆర్ పిలుపు**

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో నెలకొన్న పలు సమస్యలు, ఎండిన పంటలు, అందని కరెంటు, అందని సాగునీరు, కాలిపోతున్న మోటర్లు తదితర రైతాంగ సమస్యలపై, మంచినీటి కొరతపై అసెంబ్లీలో, మండలిలో పోరాడాలని సూచించారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా గొంతు వినిపించాలని.. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యమవుతున్న తీరుపై మాట్లాడాలని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, డీఏల పెండింగ్, పీఆర్సీ అమలుపై అసెంబ్లీ మండలి వేదికగా ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు కొట్లాడాలన్నారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని నిలదీయాలన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన దాదాపు మూడు గంటల పాటు ఎల్పీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ముఖ్యనేతలు హరీష్‌రావు, తలసాని శ్రీనివాసయాదవ్, పల్లా రాజేశ్వరరెడ్డి, జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# దేశానికి రోల్ మోడల్‌గా కొండపర్తి నిలవాలి

(మొదటి పేజీ తరువాయి)

ములుగు జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం దత్తత తీసుకున్న తాడ్వాయి మండలం కొండపర్తిని సందర్శించిన గవర్నర్ తొలుత కొమరంభీం, బిర్సా ముండ విగ్రహాలను ఆవిష్కరించారు. పాఠశాలలో డిజిటల్ తరగతులు, అంగన్వాడీ కేంద్రాన్ని, రూ.7.84లక్షల వ్యయంతో నిర్మించిన మసాలా యూనిట్, రూ.7.76లక్షల వ్యయంతో కుట్టుమిషన్ యూనిట్ ను ప్రారంభించారు. అనంతరం రిమోట్ తో వ్యవసాయ మోటార్లు ప్రారంభించారు. తదనంతరం మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. 70గృహాలు 285 మంది ప్రజలు గ్రామంలో ఉన్నారని, చిన్న గ్రామమైనా అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. సమాజాభివృద్ధికి మన సేవలు ఎంతో అవసరం అని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామంలో డిజిటల్ తరగతులు ప్రారంభించుకోవడం ఎంతో సంతోషమని, విద్యార్థులు ఇంగ్లీషు బాగా మాట్లాడుతున్నారని ఆయన తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి యూనిట్ల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. గుజరాత్ రాష్ట్రంలోని అమూల్ ప్రాంతం ఏవిధంగా ప్రసిద్ధిగాంచిందో అదే తరహాలో కొండపర్తి గ్రామం కారం, పసుపు, మసాలా, యూనిట్లకు అంతటి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రాంతంలో మిర్చి సాగు బాగుందని, మిర్చి పౌడర్ కు మంచి ఇమేజ్ రావాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా మిర్చి పౌడర్ బాగా ఫేమస్ కావాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికసిత్ భారత్ సంకల్పానికి ఈగ్రామం ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. మారుమూల ప్రాంతమైన కొండపర్తి గ్రామాన్ని తాను దత్తత తీసుకున్నానని, ఈ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తయారు చేయుటకు ఆదివాసి మారుమూల గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. తాను రాష్ట్రంలో ఏడు ఆదివాసి గ్రామాలను దత్తత తీసుకున్నానని, అన్ని గ్రామాలను అభివృద్ధిలో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుటకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో రూ.కోటి 50లక్షలతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. తాను, రాష్ట్రపతి, రాష్ట్ర మంత్రి సీతక్క అందరు ఆదివాసీ బిడ్డలమని ఆయన పేర్కొన్నారు. దేశానికి కొండపర్తి గ్రామం మోడల్ గా కావాలని పేర్కొన్నారు. మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ శబరీష్, గ్రామస్తులు గవర్నర్ ను ఘనంగా సన్మానించి మెమోంటో అందజేశారు.



**కొండపర్తిని గవర్నర్ దత్తత తీసుకోవడం సంతోషకరం : మంత్రి సీతక్క**

మంత్రి సీతక్క మాట్లాడుతూ కొండపర్తిని గవర్నర్ దత్తత తీసుకోవడం సంతోషకరమని, ఈ ప్రాంత అభివృద్ధికి జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగపు సేవలు అభినందనీయమన్నారు. దట్టమైన అడవిలో ఉన్న ప్రాంతమని రవాణా సౌకర్యం కూడా లేని గ్రామాన్ని గవర్నర్ దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఈ గ్రామాన్ని బయట ప్రపంచంతో అనుసంధానం చేస్తూ ఉత్పత్తులను అందించాలని, తద్వారా మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని సూచించారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధనలో కొండపర్తి గ్రామం రోల్ మోడల్ కావాలన్నారు. ఈ గ్రామానికి అనతి కాలంలోనే రహదారి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయుటకు గవర్నర్ ఏడు బోర్లు మంజూరు చేశారని తెలిపారు. రెండు పంటలు పండించడానికి అవకాశం కలిగిందని గవర్నర్ కు కృతజ్ఞతలు తెలిపారు. 40 పరిశ్రమలు, దిశా స్వచ్ఛంద సంస్థ సహకారంతో 100 పాఠశాలలను దత్తత తీసుకున్నామని, ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడుతున్నారని మంత్రి తెలిపారు. గవర్నర్ కార్యాలయ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ మాట్లాడుతూ కొండపర్తి గ్రామంలో పర్యటించాలని గవర్నర్ నిర్ణయం తీసుకున్నారని, వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు రూ. కోటి50 లక్షల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గిరిజన గ్రామాన్ని అభివృద్ధి చేయాలని ప్రతి కుటుంబానికి ఆదాయం రావాలని సంకల్పంతో ఈ గ్రామం అభివృద్ధిలో ముందుండాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇక్కడ తయారవుతున్న చిల్లీ, పసుపు, మసాలా యూనిట్ మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. హైదరాబాదులో మహిళా స్వయం సహాయక సంఘాలకు వ్యాపారాలు నిర్వహణకు ప్రముఖ ప్రాంతంలో దుకాణాన్ని కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలో 150 ఎకరాల్లో లాభదాయకమైన మార్కెటింగ్ కలిగిన ఆధునిక వ్యవసాయ సాగు చేపట్టేందుకు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గవర్నర్ తీసుకున్న ఏడు గిరిజన గ్రామాల్లో అభివృద్ధి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి పాటుపడే సంస్థలకు రాష్ట్రవ్యాప్తంగా అవార్డు ప్రధానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ కొండపర్తి గ్రామంలో 70గృహాలు 285 మంది జనాభా ఉన్నారని, ఈ గ్రామాన్ని అభివృద్ధి చేయుటకు గవర్నర్ దత్తత తీసుకోవడం సంతోషకరమన్నారు. 50 ఎకరాల్లో మిర్చి సాగవుతుందని అదనంగా సాగు చేపట్టేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శబరీష్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, జిల్లా అటవీశాఖ అధికారి రాహూల్ కిషన్ జాదవ్, గవర్నర్ కార్యాలయ సంయుక్త కార్యదర్శి భవాని శంకర్, గవర్నర్ ఏడిసి మేజర్ అమన్ కుందు, గవర్నర్ సిఎస్ఓ శ్రీనివాసరావు, గ్రంథాలయ కమిటీ చైర్మన్ రవి చందర్, గ్రామ పెద్దలు లచ్చు పటేల్, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ములుగులో ఘనస్వాగతం

**జిల్లా పర్యటనలో భాగంగా ములుగుకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఘనస్వాగతం పలికారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క, కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ డాక్టర్ పి.శబరీష్, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ పుష్పగుచ్ఛాలు అందజేశారు. గట్టమ్మ సమీపంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంత్రి సీతక్కతో కలిసి నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై కొద్దిసేపు చర్చించారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తాడ్వాయి మండలం కొండపర్తికి రోడ్డు మార్గంలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.**

# లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

## మహిళల రక్షణకు శక్తి యాప్ తెచ్చాం

పోలీసులు అప్రమత్తంగా లేకపోతే చర్యలు


ఈగల్ వ్యవస్థతో గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపాం

రాజకీయ ముసుగులో నేరాలు, ఘోరాలు చేస్తామంటే చూస్తూ ఊరుకోం

నా రాజకీయ జీవితంలో హత్యా రాజకీయాలకు తావులేదు

గత ఐదేళ్లు అసెంబ్లీలో బూతులు విన్నాం.. ఇప్పుడు ప్రజా సమస్యలపై చర్చిస్తున్నాం

శాసనసభలో సీఎం చంద్రబాబు నాయుడు



**మహా :** శాంతి,భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవ్వరినీ ఉపేక్షించమని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఆడబిడ్డల జోలికొస్తే తాటతీస్తామని, మహిళల రక్షణ కోసమే శక్తి యాప్ తెచ్చామని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణలో గత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ప్రజలు స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితులు తలెత్తాయని, ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై శాసనసభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రజలు భయం లేకుండా సంతోషంగా ఉండాలంటే లా అండ్ ఆర్డర్ చాలా ముఖ్యమని అన్నారు.

**ఈగల్ తో డ్రగ్స్,గంజాయిపై ఉక్కుపాదం**

గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో డ్రగ్స్ , గంజాయి వాడకం విపరీతంగా పెరిగింది. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా దీనిపై తెలుగుదేశం పార్టీ ఆందోళన చేస్తే తిరిగి మా కార్యలయంపైనే దాడులు చేశారన్నారు. ఏ రాజకీయ పార్టీకైనా పార్టీ కార్యాలయమంటే దేవాలయమని, గతంలో ఎక్కడా పార్టీ ఆఫీస్ లపై దాడులు జరిగిన ఘటనలు నా 45 ఏళ్ల రాజకీయ జీవితంలో నేను చూడలేదన్నారు. రాజకీయ కక్షసాధింపులకు నేను దూరంగా ఉంటానని, గత పాలకులు కనీసం గంజాయి, డ్రగ్స్ పై సమీక్ష చేయలేదన్నారు. అసెంబ్లీలో చర్చించిన పాపాన పోలేదు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిలో మార్పు అంత తేలిగ్గా రాదన్నారు. వ్యవస్థీకృతంగా మారిన గంజాయిసాగు, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు ఈగల్ వ్యవస్థను తీసుకొచ్చామన్నారు. స్వార్థం కోసం గంజాయి పండించి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడకూడదని, ఎట్టి పరిస్థితుల్లో రాష్ట్రంలో గంజాయి పండించేందుకు వీల్లేదన్నారు.

**సోషల్ మీడియాలో పిచ్చి రాతలు రాస్తే అంతే సంగతులు**

గత పాలకులు రాజకీయ లబ్ధి కోసం ఎంతకైనా దిగజారారని, సోషల్ మీడియా ముసుగులో రోత పుట్టించే రాతలు రాశారని చంద్రబాబు మండిపడ్డారు.మహిళలపై వ్యక్తిగత దూషణలు చేశారు, ఆడబిడ్డలు తలెత్తుకుని తిరగలేని విధంగా పోస్టులు పెట్టారన్నారు. అసెంబ్లీ లోపల, బయటా బూతులతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని, వాటన్నింటికీ చెక్ పెట్టామన్నారు. అసెంబ్లీలో బూతులకు తావులేదంటూ ప్రజా సమస్యలపై. అర్ధవంతమైన చర్చ జరుగుతోందన్నారు. మరోవైపు తీవ్ర వాదం అరికట్టి మత సామరస్యం పెంచాలన్నారు. ముఠా నాయకులు, రౌడీ అనే మాట వినపడకూడదని నేను గతంలో కూడా మెసేజ్ ఇచ్చి ఆచరణలో చేసి చూపించానని పేర్కొన్నారు.

**పేదల భూములు కాపాడతాం**

ల్యాండ్ గ్రాబింగ్ నిషేధం కింద కొత్త చట్టం తీసుకొస్తున్నామని చెప్పిన చంద్రబాబు గత పాలకులు చేసిన భూ మాఫియా అంతా ఇంతా కాదన్నారు. 22 ఏ ఉపయోగించి భూ దందాలు చేశారని, రికార్డులు తారుమారు చేశారన్నారు. ప్రభుత్వ, పేదల , ఫారెస్ట్ భూములు కొట్టేశారని, అందుకే కొత్త చట్టం తెస్తున్నామన్నారు. భూ కబ్జాలకు పాల్పడితే కొత్త చట్టం ద్వారా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఇకపై ఎవరైనా భూ కబ్జా అనాలంటే భయపడాలన్నారు. నేరాలు చేసి ,సాక్ష్యాలు తారుమారు చేసి తప్పించుకునే వారికి కాలం చెల్లింది రాత్రి సమయంలో డ్రోన్ పెట్రోలింగ్ చేస్తామన్నారు. సీసీ టీవీ కెమెరాలు పెడుతున్నాం.. 26 సైబర్ సెక్యూరిటీ స్టేషన్లు పెడుతున్నం. నేరస్థులను వెంటనే పట్టుకుంటాం. నేను సమైక్యాంధ్రలో ప్రతి రెవెన్యూ డివిజన్ కు పోలీస్ డ్రాగ్స్ ను పెట్టి నేరాలకు అడ్డుకట్ట వేశానని పేర్కొన్నారు.

### మహిళా భద్రతకు శక్తి యాప్

ప్రేమ పేరుతో అమ్మాయిలను ట్రాప్ చేసేవారి తాట తీస్తామని, గత టీడీపీ ప్రభుత్వంలో గుంటూరు జిల్లా దాచేపల్లిలో చిన్నారిపై అత్యాచారం జరిగింది, 18 టాస్క్ ఫోర్స్ బృందాలు నియమించి ప్రభుత్వ యంత్రాంగాన్ని అక్కడ మోహరించాం, ప్రభుత్వం శిక్షిస్తుందనే భయంతో నిందితుడు ఉరేసుకుని చనిపోయాడన్నారు. ఆడబిడ్డల జోలికొస్తే చూస్తూ ఊరుకోమని ఆనాడు విజయవాడలో ర్యాలీ నిర్వహించామని గుర్తు చేశారు. మహిళల రక్షణ కోసమే శక్తి యాప్ తెచ్చాం. ఆడబిడ్డలపై అత్యాచారాలకు ఒడిగడితే అదే వారికి చివరిరోజు. అత్యవసర పరిస్థితులు లేక ఆపదలో చిక్కుకున్నప్పుడు మహిళలు శక్తి యాప్ లో ఫిర్యాదు చేస్తే చాలు...నిమిషాల వ్యవధిలో పోలీసులు వచ్చి రక్షిస్తారు. గత ప్రభుత్వంలో దిశా యాప్ అని ప్రచారం చేశారు. ఏమైంది..దిక్కుమాలిన యాప్ గా మిగిలిందన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత పోలీసులదేనని, మహిళల భద్రత విషయంలో అప్రమత్తంగా లేకపోతే పోలీసులపైనా చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**రాజకీయ ముసుగులో నేరాలు-ఘోరాలు**

సంచలనం కలిగించిన వైఎస్ వివేకా హత్య ఉదంతం తలుచుకుంటే ఆందోళన కలుగుతుందని, ఆ కేసుకు సంబంధించి 6 మంది సాక్ష్యులు చనిపోవడంపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. 2019లో వివేకా హత్య జరిగింది, మొదట వివేకా గుండెపోటుతో చనిపోయినట్టు వాట్సాప్ మెసేజ్ వచ్చింది, ఎన్నికల హడావుడిలో నేనూ అదే నిజమనుకున్నానని అన్నారు. నేరస్థులు ఏ విధంగా ట్రాప్ లో వేస్తారో ఇదో ఉదాహరణ అని పేర్కొన్నారు. మధ్యాహ్నానికి బాడీ పోస్టుమార్టమ్ చేయాలని ఆయన కూతురు సునీత అడిగారు. ఆవిడ పోస్టుమార్టమ్ అడగకపోతే నిజం సమాధయ్యేదన్నారు. అప్పటివరకూ గుండెపోటు అని ప్రచారం చేసిన టీవీ చానల్ పోస్టుమార్టమ్ తర్వాత మాట మార్చి, నారాసుర రక్త చరిత్ర అని నాపై విష ప్రచారం చేశారని మండిపడ్డారు. నా 45 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎక్కడా హత్యా రాజకీయాల మరక అంటకుండా ఉన్నానని, హత్యా రాజకీయాలు చేసిన వారికి ప్రజాక్షేత్రంలో శిక్ష పడేలా చేశానని అన్నారు. రాజకీయ ముసుగులో నేరాలు చేసి తప్పించుకుంటానంటే ఈ ప్రభుత్వంలో సాగనివ్వమని, ప్రజలకు భద్రత కల్పించడం మన బాధ్యత అని అన్నారు. నియోజకవర్గాల్లో శాంతిభద్రతల పర్యవేక్షణ ఎమ్మెల్యేల బాధ్యత. పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తామన్నారు. ప్రభుత్వం ఉదాసీనంగా ఉంటే పేట్రేగుతారు, ప్రభుత్వం కఠినంగా ఉంటే అందరూ లైన్ లోకి వస్తారన్నారు.

# సింగరేణిలో కొత్త పవర్ ప్లాంట్

## ఏటా మరో రూ.300 కోట్ల లాభాలు

బీహెచ్ఈఎల్ తో కీలక ఒప్పందం..సీఎండీ కీలక ప్రకటన



**మహా :** మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి బీహెచ్ఈఎల్ సంస్థతో సింగరేణి ఒప్పందం కుదుర్చుకుంది. ప్లాంట్ నిర్మాణానికి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా సోమవారం (మార్చి 10న) ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ బలరాం కీలక ప్రకటన చేశారు. ఈ కొత్త ప్లాంట్ నిర్మాణం పూర్తయితే.. సంవత్సరానికి అదనంగా మరో రూ.300 కోట్లు లాభాలు వస్తాయని అంచనా వేస్తున్నారు. జైపూర్ వద్దనున్న 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో మరో 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు పూర్తి కాగా ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ తో సింగరేణి సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ తరపున సీఎండీ ఎన్. బలరాంతో పాటు డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి. సత్యనారాయణ రావు, డైరెక్టర్ (ఆపరేషన్స్), ఎల్. వి.సూర్యనారాయణ, డైరెక్టర్ (పీ అండ్ పీ) కె.వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) ఎస్.డి.ఎం.సుభానీ, సింగరేణి విద్యుత్ విభాగం ఉన్నతాధికారులు, బీహెచ్ఈఎల్ నుంచి జనరల్ మేనేజర్, హెడ్ పార్థసారథి దాస్, జీఎం జోగేష్ గులాటి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎండీ ఎన్ బలరాం మాట్లాడుతూ, ఈ ప్లాంట్‌ను గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తి చేయాలని ఒప్పందం ఉన్నప్పటికీ 40 నెలల్లోనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా వచ్చే నెల నుంచే పనులు ప్రారంభించాలని సూచించారు. ఇచ్చిన షెడ్యూల్‌లోపే పనులు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. పవర్ ప్రాజెక్టు ప్రాంగణంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని వినియోగించుకుని త్వరితగతిన ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. బీహెచ్ఈఎల్ జీఎం అండ్ హెడ్ పార్థసారథి దాస్ మాట్లాడుతూ, సింగరేణి పవర్ ప్లాంట్‌ను అతి ప్రాధాన్య ప్రాజెక్టుగా తమ బోర్డు నిర్ణయించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో పనులను వెంటనే ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. గతంలో చేపట్టిన 1200 మెగావాట్ల ప్రాజెక్టులో ఎదురైన సమస్యలను ముందే అధిగమించేలా ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు.

ఈ ఒప్పందం ప్రకారం బీహెచ్ఈఎల్ సంస్థ 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి సంబంధించి బాయిలర్స్, టర్బైన్స్, జనరేటర్ల (బీటీజీ) ఏర్పాటుతో పాటు అన్ని రకాల సివిల్ తదితర అన్ని నిర్మాణాలను 48 నెలల్లో అంటే నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం సింగరేణి సంస్థ 2016లో పూర్తయిన 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం విజయవంతంగా నడుస్తూ కంపెనీకి ప్రతి ఏడాది సుమారు రూ.450 కోట్ల వరకు లాభాలను ఆర్జించి పెడుతోంది. ఇప్పటివరకు ఈ ప్లాంటు సుమారు 70 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను రాష్ట్ర అవసరాలకు అందించటం గమనార్హం. దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న థర్మల్ విద్యుత్ కేంద్రాలలోకెల్లా అత్యధికంగా ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) సాధిస్తూ సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం పలుమార్లు జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. ఈ ప్లాంట్ పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేస్తూ ఇదే ప్రాంగణంలో సింగరేణి సంస్థ మరో యూనిట్ స్థాపించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో.. కొత్త ప్లాంట్‌కు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణ పనులకు ఒప్పందం కుదుర్చుకున్నారు కూడా. ఈ ప్లాంట్ పూర్తయితే సింగరేణి సంస్థకు ఏడాదికి అదనంగా మరో రూ.300 కోట్ల రూపాయల వరకు లాభాలు చేకూరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# ప్రసాద్ పథకంలోకి బల్కంపేట ఎల్లమ్మ ఆలయం



- కేంద్రం కీలక నిర్ణయం
- ఆలయ అభివృద్ధికి నిధులు
- రూ. 4.21 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు

**మహా :** హైదరాబాద్ మహా నగరంలో ఉన్న ప్రముఖ ఆలయాల్లో బల్కంపేట రేణుకా ఎల్లమ్మ ఆలయం ఒకటి. ఈ ఆలయానికి నగరవాసులే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. బోనాలు, ఆలయ బ్రహ్మోత్సవాల సమయంలో వేల సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శిస్తుంటారు. అయితే ప్రస్తుతం అక్కడ సరైన సౌకర్యాలు లేవు. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఆలయ రూపురేఖలు మార్చేలా అభివృద్ధి చేసేందుకు రెడీ అయ్యారు. దేశంలో ఆలయాల అభివృద్ధి, టెంపుల్ టూరిజం కోసం కేంద్రం ప్రభుత్వం కొత్తగా 'ప్రసాద్' స్కీం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ స్కీంలో భాగంగా హైదరాబాద్ బల్కంపేట ఎల్లమ్మ దేవస్థానంలో అభివృద్ధి పనులకు తాజాగా కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు వివరాలను కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షేకావత్ స్వయంగా ఎక్స్ వేదికగా వెల్లడించారు. ప్రసాద్ స్కీం ద్వారా ద్వారా రూ. 4.21 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఒకేసారి 200 మందికి పైగా వసతి కల్పించే ఆధునిక సౌకర్యాలతో కూడిన 3 అంతస్తుల అన్నదాన భవనాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అందుకు సంబంధించిన నమూనా ఫోటోను ట్విట్టర్‌లో రిలీజ్ చేశారు. ఆలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మికతకు నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా వెల్లడించారు.

**హర్షం వ్యక్తం చేసిన కిషన్ రెడ్డి**

ప్రసాద్ పథకంలో బల్కంపేట ఎల్లమ్మ ఆలయాన్ని చేర్చటంపై కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి ప్రాజెక్టుకు నిధులు కేటాయించినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షేకావత్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర నిర్ణయం ద్వారా భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుతాయని చెప్పారు. హైదరాబాద్ నగరంలో ఆలయం ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడటానికి కూడా కేంద్రం నిర్ణయం దోహదపడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం, దేవాలయాల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని చెప్పారు. గతంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయాన్ని కూడా ప్రసాద్ పథకంలో చేర్చారు. ఈ పథకం ద్వారా ఆలయంలో 100 గదుల సామర్థ్యం గల అతిథి గృహం, అన్నప్రసాద భవనం, క్యూ కాంప్లెక్స్‌ల అభివృద్ధికి ఆమోదం తెలిపారు.



# దేశంలోనే తొలి అర్బన్ రోప్ వే

## వారణాసిలో ట్రయల్ రన్ ప్రారంభం

- రూ.807 కోట్లతో రోప్ వే ప్రాజెక్టు
- 3.75 కిలోమీటర్ల దూరం 15 నిమిషాల్లో ప్రయాణం
- రోజుకు 16 గంటలు సేవలు అందించేలా డిజైన్

**మహా :** రోప్ వే అనగానే మనకు గుర్తొచ్చేది ఎక్కువగా హిల్ స్టేషన్లే. పర్వత ప్రాంతాల్లో సులువుగా రవాణా చేసేందుకు రోప్ వేలను ఉపయోగిస్తుంటారు. రోప్ వేల ఏర్పాటు, నిర్వహణ కష్టసాధ్యమైన పని. అదే జనావాస ప్రాంతాల్లో రోప్ వేలను ఏర్పాటు చేయడం అంటే కత్తిమీద సాము లాంటిది. తాజాగా, ఉత్తరప్రదేశ్ లోని వారణాసి నగరంలో అర్బన్ రోప్ వేలను ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల కిందట ఈ రోప్ వే ట్రయల్ రన్ ను ప్రారంభించారు. మూడు నెలల పాటు ప్రయోగాత్మకంగా పరిశీలించనున్నారు. ఇది అమల్లోకి వస్తే వారణాసి నగరంలో రోడ్డు రవాణాకు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడనుంది. రద్దీని తగ్గించి, వివిధ ప్రాంతాల మధ్య కనెక్టివిటీని పెంచుతుందని అధికారులు తెలిపారు. దీనిపై నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్ మెంట్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఎల్ఎంఎల్) ప్రాజెక్ట్ డైరెక్టర్ పూజా మిశ్రా స్పందించారు. ఇది రూ. 807 కోట్ల విలువైన ప్రాజెక్టు అని వెల్లడించారు. నగర రవాణాను మెరుగుపర్చడమే కాకుండా, ట్రాఫిక్ రద్దీని కూడా తగ్గిస్తుందని తెలిపారు. ప్రస్తుతం కాంట్, రథ్ యాత్ర ప్రాంతాల మధ్యన 3.75 కిలోమీటర్ల దూరానికి ఒక గండోలా (రోప్ వే తొట్టె)ను తిప్పుతున్నామని వివరించారు. 15 నిమిషాల్లో గమ్యం చేరుకోవచ్చని తెలిపారు. రానున్న రోజుల్లో ట్రయల్ రన్ లో భాగంగా మరిన్ని గండోలాలు తిప్పుతామని వెల్లడించారు.

ఇప్పటికే రోప్ వే ట్రాన్స్ పోర్టు కోసం కాంట్, విద్యాపీఠ్, రథ్ యాత్ర వద్ద స్టేషన్లు నిర్మించారు. ఎస్కలేటర్లు, లిఫ్టులు, వీల్ చైర్ ర్యాంపులు, రెస్ట్ రూములు, పార్కింగ్ ఏరియాలు, ఫుడ్ కోర్టులు, కేఫ్ లు, దుకాణాలు కూడా ఈ స్టేషన్లలో ఏర్పాటు చేస్తున్నారు. ఈ రోప్ వే రవాణా వ్యవస్థలో భాగంగా 150 ట్రాలీ కార్లను వినియోగించనున్నారు. ఇవి నేలకు 45 నుంచి 50 మీటర్ల ఎత్తులో బలమైన కేబుల్స్ ఆధారంగా ప్రయాణించనున్నాయి. ఒక్కో ట్రాలీ కార్ లో 10 మంది ప్రయాణికులు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. రోజుకు 16 గంటల పాటు సేవలు అందించేలా ఈ రోప్ వే వ్యవస్థకు రూపకల్పన చేస్తున్నారు.

# ప్రపంచ దేశాలకు అమెరికా సాయం కట్

## ట్రంప్ మార్క్ ప్రక్షాళన

5200 కాంట్రాక్టర్లు రద్దుచేస్తూ ప్రకటన



ట్రంప్ ప్రక్షాళన

**మహా:** అమెరికా ప్రభుత్వం అంతర్జాతీయ సహాయ కార్యక్రమాల్లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్ఎయిడ్) ద్వారా నడుస్తున్న వేలాది కార్యక్రమాలకు ముగింపు పలకనున్నట్లు అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో ప్రకటించారు. అమెరికా ప్రభుత్వం చేపట్టిన ఆరు వారాల సమీక్ష అనంతరం యూఎస్ఎయిడ్‌లోని 83% కార్యక్రమాలను నిలిపివేయాలని నిర్ణయం తీసుకుంది. దాదాపు 5200 కాంట్రాక్టులను రద్దు చేసినట్లు రూబియో వెల్లడించారు. "ఇప్పటివరకు వేలాది కోట్ల డాలర్లు వెచ్చించినా, ఆశించిన ఫలితాలు రాలేదు. కొన్నిచోట్ల ప్రతికూల ప్రభావాలు కూడా కనిపించాయి. అందుకే అమెరికా జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ సంస్కరణలను చేపట్టాం," అని ఆయన ట్విటర్ ద్వారా వెల్లడించారు. విదేశాంగశాఖ మంత్రి ప్రకటన ప్రకారం, ఈ చర్యలు అమెరికా ప్రయోజనాలను కాపాడేందుకు తీసుకున్న చర్యలుగా పేర్కొన్నారు. అమెరికా కాంగ్రెస్‌లో చర్చించిన అనంతరం, కొన్ని కీలక కార్యక్రమాలను మాత్రం కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే, యూఎస్ఎయిడ్ నిధుల కుదింపుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన డొనాల్డ్ ట్రంప్, యూఎస్ఎయిడ్ నిధుల కుదింపుపై ప్రత్యేక దృష్టి సారించారు. అంతర్జాతీయ సహాయ నిధులను తాత్కాలికంగా నిలిపివేయడంతో పాటు, అనేక మంది ఉద్యోగులను తొలగించారు. ఈ నిర్ణయాలకు వ్యతిరేకంగా న్యాయస్థానాల్లో అనేక దావాలు కూడా నమోదయ్యాయి. యూఎస్ఎయిడ్ ద్వారా అభివృద్ధి చెందుతున్న అనేక దేశాల్లోని ప్రాజెక్టులు ఈ నిర్ణయంతో ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆరోగ్య, విద్య, పేదరిక నిర్మూలన తదితర రంగాల్లో ఈ మార్పులు తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది. అమెరికా ప్రభుత్వ ఈ సంస్కరణలు ప్రపంచ రాజకీయాల్లో మరిన్ని చర్చలకు దారితీయనున్నాయి.

# జోగులాంబ ఆలయ పూజారి ఆనంద్ శర్మపై ఆరోపణలు

- విచారణకు ఆదేశించిన మంత్రి కొండా సురేఖ ఆదేశం
- మంత్రిని కలిసి సస్పెండ్ చేయాలని కోరిన అర్చకులు, స్వామిజీలు, విహెచ్‌పీ
- తక్షణం విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించిన మంత్రి
- దేవాదాయ శాఖ కమిషనర్ ఆఫీసు ముందు భారీ ఆందోళన చేసిన అర్చకులు, స్వామీజీలు


**మహా :** జోగులాంబ ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ, ఈఓ పురేందర్ అవినీతి పై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ హిందూ ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ దేవాదాయ శాఖ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. హైదరాబాద్ బొగ్గులకుంటలో జరిగిన ఈ ఆందోళనకు కొత్తకోట ఆశ్రమ అర్చకుడు శివానంద స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శక్తిపీఠాలలో ఒక పీఠం అయిన అలంపూర్ జోగులాంబ ఆలయ పవిత్రతను కాపాడాలన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ పై క్రిమినల్ కేసులు వున్నందున..వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలలుగా ఆనంద్ శర్మ పై ఆరోపణలు వస్తున్నా.. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆందోళన లో పాల్గొన్న వారు మండిపడ్డారు. ఆలయం లోని ఆభరణాల మాయం , పూజారి , ఈవోల అవినీతి పై ప్రభుత్వ సమగ్ర విచారణ జరిపితే..నిజాలు బయట పడతాయన్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి మినిస్టర్ క్వార్టర్స్ లో దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిశారు. వెంటనే పూజారి ఆనంద్ శర్మను విధుల నుంచి తప్పించాలని కోరారు. అరగంటపాటు అర్చకులు, స్వామిజీలు చెప్పిన విషయాలు విన్న మంత్రి కొండ సురేఖ ఆలయ ప్రతిష్టను కాపాడతామని హామీ ఇచ్చారు. ఆనంద్ శర్మపై విచారణకు ఆదేశించారు. తక్షణం విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కమిషనర్‌ను ఆదేశించారు.



EDITORIAL సంపాదకీయం

# మాంద్యం దిశగా ప్రపంచం

వివాదాస్పద నిర్ణయాలతో ప్రపంచాన్ని గజగజలాడిస్తున్న డొనాల్డ్ ట్రంప్ తన తిక్క నిర్ణయాలతో అమెరికాకు కూడా ముప్పు తెస్తున్నాడు. అమెరికా మార్కెట్ల పతనానికి వివిధ కారణాలు ఓ ప్యాకేజీలా పనిచేస్తున్నాయి. గోల్డ్ మన్ శాక్స్ కూడా అమెరికాలో వచ్చే 12 నెలల్లో ఆర్థిక మాంద్యం వచ్చేందుకు 1520శాతం చాన్స్ ఉందని చెప్పింది. 'అమెరికాకు జలుబు చేస్తే ప్రపంచం తుమ్ముతుంది'' అనే సామెత ఇపుడు కనబడుతోంది. గంటల్లోనే 350 లక్షల కోట్ల రూ.ల సంపద ఆవిరి కావడం.. అమెరికా మార్కెట్లు గజగజలాడడమే దీనికి కారణం. వారాల వ్యవధిలోనే 4 ట్రిలియన్ డాలర్ల సంపద ఆవిరి.. ఇదీ ప్రస్తుతం అమెరికా స్టాక్ మార్కెట్ల పతనం తీవ్రత. దీంతో ప్రపంచం షేకవుతోంది. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడు అయ్యాక తలతిక్క నిర్ణయాలతో అందరినీ గెలుకుతున్నారు. ఇప్పుడు స్టాక్ మార్కెట్ల వంతు వచ్చింది. అగ్రరాజ్యం మార్కెట్లు 20 రోజులలోనే కుప్పకూలాయి. మదుపర్ల సంపద రూ.349 లక్షల కోట్లు (4 ట్రిలియన్ డాలర్లు) ఆవిరైంది. బ్రిటన్, ఫ్రాన్స్ వంటి దేశాల జీడీపీ కంటే ఇది ఎక్కువ కావడం గమనార్హం. ట్రంప్ నిర్ణయాలే.. ఇపుడు చేటు చేసేలా ఉన్నాయి. అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్ డౌన్ భయాలు సూచీలను వెంటాడుతున్నాయి. ఎస్అండ్‌పీ 500 సూచీ ఫిబ్రవరి 19వ తేదీన నమోదు చేసిన ఆల్ టైమ్ హై నుంచి ఇప్పటికి 8 శాతానికిపైగా విలువ కోల్పోయింది. నాస్ డాక్ కాంపోజిట్ డిసెంబరులో నమోదు చేసిన అత్యధిక విలువ నుంచి 10శాతం పతనమైంది. ఇక ఒక్క సోమవారమే 1.7 ట్రిలియన్ డాలర్ల సంపద కరిగిపోయింది. 2022 సెప్టెంబరు తర్వాత ఈ స్థాయిలో పతనం తొలిసారి. అపర కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన టెస్లా షేర్ ధర 15 శాతం పతనం కావడం గమనార్హం. డిసెంబరు 17 నుంచి చూస్తే దీని విలువ 50శాతం ఆవిరైంది. 479.86 డాలర్ల నుంచి 222.15 డాలర్లకు పడిపోయింది. అమెరికా మార్కెట్ల పతనానికి వివిధ కారణాలు ఓ ప్యాకేజీలా పనిచేస్తున్నాయి. వాణిజ్య విధానాల్లో హఠాత్తుగా వస్తున్న మార్పులు, ఆర్థిక మాంద్యం భయాలు, స్టాక్స్ అధిక విలువలు వీటిలో కొన్ని. ప్రధాన వాణిజ్య భాగస్వాములైన కెనడా, మెక్సికో, ఐరోపాతో వాణిజ్య యుద్ధాలతో చాలా కంపెనీలు తమ వ్యాపార వ్యూహాలను పునః పరిశీలిస్తున్నాయి. అమెరికా అతి సంపన్నులపై మార్కెట్ల పతనం ప్రభావం తీవ్రంగా ఉంటోంది. ఎందుకంటే మార్కెట్లలో 50 శాతం విలువైన సంపద 1 శాతం మంది వద్ద, 37 శాతం విలువైన సంపద 10శాతం మంది వద్ద ఉండడమే. 12శాతం వాటా 40శాతం మంది వద్ద కేంద్రీకృతమైంది. మిగిలిన 1శాతం వాటా 50శాతం మంది ప్రజల చేతిలో ఉంది దేశం మార్పు దశలో ఉందని అంటున్న ట్రంప్ మాటలు.. మాంద్యం రాదనేందుకు హామీగా నిలవడం లేదు. తాము పెద్ద కార్యమే చేపట్టామని అంటున్నారు. మార్కెట్ పతనానికి, ఆర్థిక మాంద్యానికి ట్రంప్ సర్కారు సిద్ధమైందనే సంకేతాలు ఉన్నట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. గోల్డ్ మన్ శాక్స్ కూడా అమెరికాలో వచ్చే 12 నెలల్లో ఆర్థిక మాంద్యం వచ్చేందుకు 1520శాతం చాన్స్ ఉందని చెప్పింది. కొసమెరుపు: అమెరికా ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో చెప్పాలంటే.. ఆరు నెలల్లో ట్రంప్ రూ.6 కోట్ల కోట్లు అప్పు తీర్చాల్సి ఉందట. అమెరికా మొత్తం అప్పుల్లో ఇది 31 శాతానికి సమానం. ఆర్థిక వ్యవస్థ మందగమనంతో ఈ అప్పులను ఎలా రీఫైనాన్స్ చేయాలా? అని ట్రంప్ తలపట్టుకుని కూర్చున్నారు. ట్రంప్ తన దూకుడుతో ఆర్థికపరిస్థితిని సెట్ చేస్తాడనుకుంటే ఏదో వచ్చి పందిరి కూల్చిన చందంగా వ్యవహరిస్తాడనుకోలేదని అమెరికన్లు బావురుమంటున్నారు.




# బైబై కెనడా

## రష్యా బాట పడుతున్న భారత విద్యార్థులు

అమెరికా, ఆస్ట్రేలియా, యూకే వెళ్లేందుకు విద్యార్థుల విముఖత

రష్యా, ఫ్రాన్స్, జర్మనీ వైపు చూస్తున్న భారత విద్యార్థులు

2023తో పోలిస్తే గతేడాది 33.7 శాతం మంది రష్యాకు పయనం



**మహా:** ఇపుడు భారతీయ విద్యార్థులు కెనడాకు బైబై చెప్పేస్తున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, యూకే వెళ్ళేందుకు కూడా ఆసక్తి చూపడం లేదు. ఇపుడు రష్యా, ఫ్రాన్స్ ఆకర్షిస్తున్నాయి. గతేడాది విదేశాలకు వెళ్లిన భారతీయ విద్యార్థుల సంఖ్య అంతకు క్రితం సంవత్సరంతో పోలిస్తే దాదాపు 15 శాతం తగ్గిపోయినట్టు కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ పార్లమెంటుకు తెలిపింది. గతంలో కెనడాకు క్యూకట్టిన విద్యార్థులు ఈసారి అటువైపు చూసేందుకు ఇష్టపడటం లేదు. ఫలితంగా కెనడాను ఎంచుకునే విద్యార్థుల సంఖ్య 41 శాతం తగ్గింది. అలాగే, అదే సమయంలో రష్యాకు వెళ్లే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2023తో పోలిస్తే గతేడాది రష్యా వెళ్లిన విద్యార్థుల సంఖ్య 33.7 శాతం పెరిగింది. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) సభ్యుడు ఈ.టీ. మొహమ్మద్ బషీర్ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సుకాంత మజుందార్ ఈ వివరాలు వెల్లడించారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. 2022లో 7,50,365 మంది విద్యార్థులు విదేశాల్లో చదువుతుండగా, 2023లో ఈ సంఖ్య మరింత పెరిగి 8,92,989 మందికి చేరింది. అయితే, గతేడాదికి వచ్చే సరికి ఈ సంఖ్య గణనీయంగా తగ్గింది. 15 శాతం తగ్గి 7,59,064 మందికి పడిపోయింది. ఇక ఉన్నత చదువుల కోసం కెనడా వెళ్లే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. 2023లో 2,33,532 మంది విద్యార్థులు కెనడా వెళ్లగా, గతేడాది 41 శాతం తగ్గి 1,37,608కి పడిపోయింది. కెనడా గతేడాది స్టూడెంట్ వీసా నిబంధనను కఠినతరం చేయడమే ఇందుకు కారణం. అప్లికేషన్లను చాలా జాగ్రత్తగా పరిశీలిస్తుండటంతో వీసా తిరస్కరణ రేటు భారీగా పెరిగింది. కెనడాతోపాటు అమెరికా, యూకే, ఆస్ట్రేలియా వెళ్లే విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గినట్టు కేంద్ర విద్యాశాఖ గణాంకాలు చెబుతున్నాయి.

### అమెరికాకు తగ్గుముఖం

అమెరికా వెళ్లే విద్యార్థుల సంఖ్య 2023తో పోలిస్తే 2024లో 12.9 శాతం తగ్గింది. అంటే అంతకు ముందు ఏడాదిలో 2,34,473 మంది అమెరికాలో చదువుకుంటే 2024లో ఈ సంఖ్య 2,04,058కి పడిపోయింది. అలాగే, యూకేకు వెళ్లే విద్యార్థుల సంఖ్య 27.7 శాతం, ఆస్ట్రేలియా వెళ్లే విద్యార్థుల సంఖ్య 12 శాతం తగ్గింది. ఇక చైనాకు వెళ్లే విద్యార్థుల సంఖ్య కూడా భారీగా తగ్గింది. 2023లో 7,279 మంది చైనా వెళ్లగా, గతేడాది 4,978 మంది చైనా వెళ్లారు. అదే సమయంలో రష్యా, ఫ్రాన్స్, జర్మనీలను ఎంచుకునే భారత విద్యార్థుల సంఖ్య పెరిగింది. 2022లో 19,784 మంది విద్యార్థులు రష్యా వెళ్లగా, 2023లో ఇది 23,503కి పెరిగింది. గతేడాది మరింత పెరిగి 31,444కి చేరుకుంది. 2022లో ఫ్రాన్స్‌కు 6,406 మంది విద్యార్థులు వెళ్లగా, 2023లో ఆ సంఖ్య 7,484కు పెరిగింది. 2024లో ఈ సంఖ్య మరింత పెరిగి 8,536కు చేరుకుంది. అదే సమయంలో జర్మనీ వెళ్లే భారత విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 2022లో 20,684 మంది, 2023లో 23,296 మంది విద్యార్థులు జర్మనీ వెళ్లగా, 2024లో ఏకంగా 34,702 మంది విద్యార్థులు జర్మనీ వెళ్లారు. న్యూజిలాండ్‌ను ఎంచుకునే భారత విద్యార్థుల సంఖ్య కూడా బాగానే పెరిగింది. 2022లో 1,605 మంది కివీ దేశంకు పయనమవగా 2024లో ఈ సంఖ్య 7,297కు పెరిగింది. ఫిలిప్పీన్స్‌ను ఎంచుకునే విద్యార్థుల సంఖ్య మాత్రం కొంత తగ్గింది. 2022లో 11,261 మంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఫిలిప్పీన్స్ వెళ్లగా, 2024లో ఈ సంఖ్య 8,101కి పడిపోయింది.

# జపనీయులు ఎందుకు ఆరోగ్యం ఉంటారు?



తినే తిండి.. ఉండే పరిసరాలు.. చుట్టూ ఉండే వాతావరణం ఏదీ ఆరోగ్యవంతంగా ఉండదన్న భావన అంతకంతకూ పెరుగుతోంది. ఇందుకు భిన్నంగా ఉంటుంది జపాన్. అక్కడి ప్రజలు వయసు మీద పడుతున్నా.. చలాకీగా ఉండటమే కాదు.. ఆరోగ్యంతో జీవిస్తుంటారు. దీనికి కారణం వారు తీసుకునే ఆరోగ్యకరమైన ఆహారం కూడా కారణమని చెబుతారు. జపనీయుల డైట్ చూస్తే.. వారి ఆరోగ్య రహస్యం ఇట్టే తెలుస్తుందన్నమాట వినిపిస్తూ ఉంటుంది. ఇంతకీ జపాన్ డైట్‌లో ఏం ఉంటుంది? ప్రపంచంలోని అత్యుత్తమ ఆహార విధానాల్లో జపాన్ డైట్ ఎందుకు నిలిచింది? లాంటి ప్రశ్నలకు సమాధానాలు వెతికితే.. మనం తెలుసుకోవాల్సినవి.. మనం మార్చుకోవాల్సిన ఆహార అలవాట్లు ఇట్టే అర్థమవుతాయి.

### ఆకలికి మించి ఆహారం తీసుకోరు

ఆకలికి మించి ఆహారం తీసుకోవటానికి జపనీయులు ఇష్టపడరు. తాము కడుపు నిండుగా తినకుండా అవసరమైన ఆహారానికి 80 శాతం మాత్రమే ఫుడ్ తీసుకోవటం.. 20 శాతం కడుపును ఖాళీగా ఉంచుకోవటం వారు అనుసరించే విధానాల్లో ఒకటి. అది చిన్నప్పటి నుంచే పిల్లలకు నేర్పిస్తారు. జపనీయులు తాజాగా తయారు చేసిన ఆహారానికి ప్రాధాన్యతను ఇస్తారు. నూనెలు తక్కువగా వినియోగిస్తారు. పాలు.. వెన్న.. పెరుగు.. ఐస్ క్రీం లాంటి పాల ఉత్పత్తులు.. కొవ్వు శాతం ఎక్కువగా ఉండే నూనెలు.. వెన్న.. సాస్‌లు.. ఆహారాన్ని నిల్వ ఉంచేందుకు రసాయనాలు వినియోగించరు. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉండే సాల్మన్.. ట్యూనా లాంటి చేపలు.. సముద్రపు నాచును తీసుకుంటారు. ఇది చాలా శక్తివంతమైన ఆహారం. ఇందులో కణాల్ని ఆరోగ్యంగా ఉంచే విటమిన్ ఎ..సీ.. ఇ.. కెరోటినాయిడ్లు.. ఫ్లేవనాయిడ్స్ లాంటి యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఈ కారణంతోనే ఒబెసిటీ సమస్య తక్కువగా ఉండే దేశాల్లో జపాన్ ఒకటిగా నిలిచింది. ఆహారాన్ని నములుతూ తినటం.. నిదానంగా తినటం.. తక్కువ మోతాదులో ఆహారాన్ని తీసుకోవటం.. అందుకు చిన్న ప్లేట్లు.. గిన్నెల్ని వినియోగించటం లాంటివి చేస్తారు. ఆహారాన్ని తీసుకోవటానికి ముందు గ్రీన్ టీ తీసుకోవటం వారికి అలవాటు.

# చైనా తన మాట నిలుపుకోవాలి



అగ్రరాజ్యం పోకడలు నచ్చని చైనా భారత్ తో చేయి కలపటం, ఇరు దేశాలు కలిస్తే ప్రపంచంలో ఏ శక్తి మమ్మల్ని అడ్డు కోలేదని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఈ పేర్కొనడం ముదవహం. రెండు దేశాలు ప్రస్తుత పరిస్థితులలో చేతులు కలపటం ఎంతో అవసరమని చైనా గ్రహించింది. అందుకే భారత్ ను దగ్గరకు చేర్చుకుంటుంది. తమ మధ్య కొన్ని ఉద్రిక్తతలు ఉన్నా అవి చర్చల ద్వారా పరిష్కరించు కుంటామని చైనా పేర్కొంది. నియంతృత్వ పోకడలను ఏ మాత్రం సహించమని, దేశాల మధ్య చక్కని సమన్వయం కోరుతున్నామని, దౌర్జన్య రాజకీయాలను ఏ మాత్రం సహించమని పరోక్షంగా అమెరికాను ఉద్దేశించి పేర్కొన్నారు.చైనా వార్షిక పార్లమెంట్ సమావేశములలో వాంగ్ ఈ భారత్ తో చేయి కలిపి సుస్థిర అభివృద్ధికి తోడ్పాటు నిస్తామని పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధే భారత్, చైనాల లక్ష్మని చెప్పారు. అయితే భారత్ ఎంత వరకు ఈ విషయంలో సహకరిస్తుందో చెప్పటం కష్టం. ఎందుకంటే చైనా అవకాశవాద రాజకీయాలు చేస్తుంది, భారత్ ను ఊరిస్తుంది అని తెలుసు. గతంలో చైనా, భారత్ పట్ల అనుసరించిన విధానలే ఇందుకు నిదర్శనం. పంచశీల ఒప్పందంకు తూట్లు పొడిచి చైనా దాడి చేయటం భారత్ ను కలవర పరచింది. ఇప్పుడు చైనా అమెరికాను అడ్డుకోవటానికి దక్షిణ ఆసియాలో భారత్ తో కలసి పనిచేయటానికి, అమెరికా ఆధిపత్యం ను నిరోదించటానికి భారత్ ను మంచి చేసుకుంటుందని నిపుణుల అభిప్రాయం. అయితే చైనా మాత్రం భారత్ సహకారం అవసరమని డ్రాగన్, ఏనుగు రెండు కలిస్తే అమెరికాను అడ్డుకోవచ్చని భారత్ ను పొగడుతోందని, చైనా పట్ల భారత్ అప్రమత్తంగా ఉండాలని ప్రజలు కోరుతున్నారు. ఒక మాట ఇస్తే దానికి కట్టుబడి ఉండే మనసత్వం భారత్ ది. చైనా అలా కాదు పరిస్థితులకు అనుగుణంగా మారుతూ ఉంటుంది. ఆసియాలో చైనా తరువాత భారత్ బలమైన దేశం అని చైనకు తెలుసు. చైనా, భారత్ సంబంధాలలో కొన్ని వైరుద్యాలు వున్నప్పటికి ఈ ఏడాది ఇరు దేశాల సంబంధాలు 75 ఏళ్ళు కావస్తున్నాదని మా మధ్య చర్చలు ఫలవంతం అవుతాయని వాంగ్ పేర్కొన్నారు. భారత్ బలమైన దేశమని ఏనుగు తో పోల్చడం చైనాకు తెలిసి వచ్చినట్లు అయింది. సుస్థిర అభివృద్ధికి భారత్ తో కలసి పని చేస్తామని చైనా వాస్తవికతకు అద్దం పట్టాలి. ఇటీవల అమెరికా వివిధ దేశాలపై విధించిన సుంకాలు ప్రయోజనకరం కాదని, దేశాల మధ్య ఈ రకమైన ధోరణి అమెరికా నిరంకుశ విధానానికి నిదర్శనమని, ఏ దేశ ప్రయోజనాలు ఆదేశానికి ఉంటాయని వాంగ్ పేర్కొన్నారు.అంతర్జాతీయ సహకారానికి కట్టుబడి ఉండాలి కాని సుంకాలు విధించటం చేటు తెస్తాయని వ్యాఖ్యనించారు. ఏమైతేనేం చైనా, భారత్ తో సామరస్య పూర్వకంగా మెలగి, రెండు దేశాల మధ్య ఉన్న సమస్యలని పరిష్కరించుకుని, సయోధ్య దిశ లో పయనిస్తాయని, అయితే చైనా మాట మీద నిలబడి తన విశ్వనీ యతను చాటుకోవాలి. అప్పుడే చైనా మాటకు నైతికత, విలువ ఉంటాయి.

**- కనుమ ఎల్లారెడ్డి, 93915 23027.**

# కాలుష్య భారతం

## 20లో 13 మనవే.. వరల్డ్‌లో చెత్తరికార్డు

**మహా ప్రత్యేకం:** కాలుష్యంలో భారతనగరాలు.. ప్రపంచంలోనే చెత్తరికార్డు నమోదుచేస్తున్నాయి. ప్రపంచంలోని 20 అత్యంత వాయు కాలుష్యం ఉన్న నగరాల్లో మన ఇండియాలోనే 13 ఉన్నాయి. వాటిలో మేఘాలయలోని బైర్నిహాట్ అగ్రస్థానంలో ఉందని వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్ 2024 పేర్కొంది. ప్రపంచంలోని అత్యంత కలుషితమైన రాజధాని నగరాల్లో ఢిల్లీ ఫస్ట్ ప్లేస్ లో ఉందని ఆ నివేదిక స్పష్టం చేసింది. స్విస్ ఎయిర్ క్వాలిటీ టెక్నాలజీ కంపెనీ ఐక్యూఎయిర్ ఈ నివేదికను రూపొందించింది. దీని ప్రకారం, 2023లో భారత్ ప్రపంచంలోనే మూడో అత్యంత కాలుష్య దేశంగా ఉండగా, 2024 నాటికి కాస్త మెరుగుపడి ఐదో స్థానానికి చేరుకుంది. మన పొరుగున ఉన్న పాకిస్థాన్‌లోని 4 నగరాలు, చైనాలోని ఒక నగరం కూడా ప్రపంచంలోని టాప్20 కాలుష్య నగరాల జాబితాలో ఉన్నాయి. ఈ నివేదిక ప్రకారం, భారత్‌లో పీఎం2.5 సాంద్రత 2023లో క్యూబిక్ మీటర్‌కు 54.4 మైక్రోగ్రాములు ఉండగా, అది 2024లో 7 శాతం మేర తగ్గింది. అంటే సగటున క్యూబిక్ మీటర్‌కు 50.6 మైక్రోగ్రాములు తగ్గింది. అయినప్పటికీ ప్రపంచంలోని అత్యంత కాలుష్య నగరాల్లో 13 భారతదేశంలోనే ఉండడం గమనార్హం. దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మరింతగా పెరుగుతోంది. 2023లో పీఎం2.5 సాంద్రత క్యూబిక్ మీటర్‌కు 102.4 మైక్రోగ్రాములు ఉండగా, అది 2024లో క్యూబిక్ మీటర్‌కు 108.3 మైక్రోగ్రాములకు పెరిగింది.

**టాప్-20లోని సిటీలు ఇవే**

ప్రపంచంలోని టాప్ 20 అత్యంత కాలుష్య నగరాల



జాబితాలో మేఘాలయలోని బైర్నిహాట్, ఢిల్లీ, పంజాబ్‌లోని ముల్లన్‌పూర్, ఫరీదాబాద్, లోని, గురుగ్రామ్, గంగానగర్, గ్రేటర్ నోయిడా, బివాడి, ముజఫర్‌నగర్, హనుమాన్‌గఢ్, నోయిడా ఉన్నాయి. దాదాపు 35 శాతం భారతీయ నగరాల్లో వార్షిక పీఎం2.5 సాంద్రత స్థాయిలు ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిమితి కంటే 10 రెట్లు ఎక్కువగా ఉన్నాయి. డబ్ల్యూహెచ్ఓ ప్రకారం పీఎం2.5 సాంద్రత క్యూబిక్ మీటర్‌కు 5 మైక్రోగ్రాముల కంటే తక్కువ ఉండాలి. కానీ భారత్‌లో ఈ పరిమితి కంటే 10 రెట్లు ఎక్కువగా పీఎం2.5 సాంద్రతలు ఉన్నాయి. మేఘాలయఅసోం సరిహద్దుల్లోని బైర్నిహాట్ పట్టణంలో చాలా డిస్టిలరీలు, ఇనుము, ఉక్కు కర్మాగారాలు ఉన్నాయి. వీటి నుంచి వెలువడే ఉద్గారాల వల్ల ఆ నగరం కాలుష్యకాసారం అవుతోంది. ఇక దేశ రాజధాని నగరమైన ఢిల్లీ ఏడాది పొడవునా అధిక వాయు కాలుష్యంతో సతమతమవుతోంది. శీతాకాలంలో అయితే పరిస్థితి మరింత తీవ్రమవుతుంటుంది. వాహన ఉద్గారాలకు తోడు, పంట వ్యర్థాలను తగులబెట్టడం, పటాకులు కాల్చడం సహా, ఫ్యాక్టరీల నుంచి వెలువడే ఉద్గారాలు ఢిల్లీలోని గాలి నాణ్యతను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ప్రమాదకర స్థాయిలో వాయు కాలుష్యానికి కారణమవుతున్నాయి.

**ఆరోగ్యసమస్యలు**

ఈ వాయు కాలుష్యం వల్ల భారత్‌లో తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా మానవుల ఆయుర్దాయం 5.2 సంవత్సరాలు తగ్గుతోందని అంచనా. గతేడాది ప్రచురించిన లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ స్టడీ ప్రకారం, 20092019 మధ్యలో భారత్‌లో ఏటా దాదాపు 1.5 మిలియన్ మరణాలు పీఎం2.5 కాలుష్యం వల్లనే కలిగాయని తేలింది. పీఎం2.5 అంటే 2.5 మైక్రాన్ల కంటే చిన్నగా ఉండే కణాలు. సింపుల్‌గా చెప్పాలంటే వాయు కాలుష్య కణాలు. ఇవి ఊపిరితిత్తుల్లోకి, రక్తప్రవాహంలోని ప్రవేశించి దీర్ఘకాలిక శ్వాస సమస్యలు, గుండె జబ్బులకు, క్యాన్సర్ రావడానికి కారణమవుతాయి.

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

## కథా సంపుటాలకు ఆహ్వానం..

"వెన్నెల సాహితీ పురస్కారం-2024" కొరకు.. 2023,2024 సం.లలో ప్రచురించిన కథా సంపుటాలు నాలుగు (4) ప్రతులను ఈక్రింది చిరునామాకు, 31మార్చి 2025లోపు పంపగలరు. సిద్దిపేటలో జరుగు సాహిత్య కార్యక్రమంలో నగదు పురస్కారం అందజేయబడును. చిరునామా, P.యాదగిరి, ఇం.నెం.17-3-86/35, జ్యోతి నిలయం, వినాయక్ నగర్ రోడ్-2, మయూరి బార్ & రెస్టారెంట్ ఎదురు వీధి, రంగధాంపల్లి చౌరస్తా దగ్గర సిద్దిపేట, 502103, cell. 92999 09516, 98482 61284.

**- పర్కపెల్లి యాదగిరి**
వెన్నెల సాహితీ సంగమం, ప్రధాన కార్యదర్శి

# కేంద్రప్రభుత్వ బడ్జెట్..
# కార్పోరేటర్లకు దోచిపెట్టే బడ్జెట్

- దేశ సంపదను లూటీ చేసిన కార్పొరేట్లకు భజన చేస్తున్న మోడీ
- పేదలను మరింత పేదరికంలోకి దిగజార్చారు
- బీజేపీ ప్రభుత్వంపై ప్రశ్నిస్తే దాడులు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** దేశ సంపదను లూటీ చేస్తున్న కార్పొరేట్లకు వంతనపాడుతూ, మోడీ భజన చేస్తున్నాడని, సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతున్న నరేంద్ర మోడీ పేదవారిని మరింత దిగదార్చి, మరింత పేదరికంలోకి తోస్తున్నాడని దుయ్యబట్టారు. కార్పొరేట్లకు భజన చేస్తున్న మోడీ బండారాన్ని ప్రజలు గుర్తించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం తుక్కుగూడ లక్ష్మీ గార్డెన్ లో జరిగిన సిపిఐ జిల్లా స్థాయి సెమినార్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ... నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో పేద వాళ్ళ ఆర్థిక పరిస్థితి దిగజారిందని, కానీ కార్పొరేట్ల సంపద 100 రెట్లు పెరిగిందని, ఇది ఏమి మాయనో నరేంద్ర మోడీ చెప్పాలని ఆయన డిమాండ్ చేశాడు. పన్నుల విధానాన్ని మార్చి జిఎస్టి పేరుతో పేదల మీద 97% పన్నులు వసూలు చేస్తూ, వసూలు చేసిన డబ్బులను కార్పొరేట్లను మేపుతున్నాడని ఆయన విమర్శించారు. దేశంలో ఖనిజ సంపద, ప్రకృతి సంపదలను కార్పొరేట్లు యవేచ్ఛగా దోచుకుపోతున్న, నరేంద్ర మోడీ వారికి మరింత దోచుకునే అవకాశాలను కల్పించడం బాధాకరమని ఆయన మండిపడ్డారు. ప్రముఖ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ... నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామిక వాదుల మీద, కవులు కళాకారుల మీద, దాడులు హత్యలు జరుగుతున్నాయని తెలిపారు. ఇది ముమ్మాటికీ కార్పొరేట్ల ప్రభుత్వమని ఆయన అన్నారు. ప్రజలు తిరుగుబాటు చేస్తేనే ప్రభుత్వాలు రాజ్యాలు మారతాయని, శ్రామిక రాజ్యాన్ని నిర్మాణం చేయడానికి ప్రతి కమ్యూనిస్టు పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు ప్రముఖ సైకాలజిస్ట్ లక్ష్మణ్ మాట్లాడుతూ మానసిక దృఢత్వంతో మంచి ఆలోచనలు మంచి వ్యక్తిత్వం కలిగిన వారు దేనినైనా విజయం సాధిస్తారని ఆయన తెలిపరుకమ్యూనిస్టుల త్యాగాలు చాలా గొప్పవి వాటిని ప్రజలకు అందే విధంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు ఈ సెమినార్ కార్యక్రమానికి అధ్యక్షునిగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి రాష్ట్ర సమితి సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు పానుగంటి పర్వతాలు ముత్యాల యాదిరెడ్డి కే రామస్వామి, మహేశ్వరం నియోజకవర్గం బి దత్తు నాయక్, కావలి నరసింహ ఓరుగంటి యాదయ్య పై మీద జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి, టి రామకృష్ణ ఎం ప్రబలింగం బీ జంగయ్య బాతరాజు, మండల కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, పల్నాటి యాదయ్య, కె రాజు, దేవేంద్ర గౌడ్ బ్రహ్మచారి, ఎన్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పంటలకు నీరు సమృద్ధిగా అందేలా చర్యలు

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, మహా ;** శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ డిబిఎమ్ 54, 57 కాలువ ద్వారా రబి కాలానికిపంటలకునీరుసమృద్ధిగాఅందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని మహబూబ్నగర్, ఉకల్, ఘటికల్, జగన్నాథపల్లి గ్రామాలలో క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి కలెక్టర్ వ్యవసాయ పంట పొలాలను సాగునీరు అందుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మైలారం బ్యాలెన్సింగ్ సందర్శించి నీటి నిలువ సామర్థ్యం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారాబంది నీటి విడుదల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ చివరి పంట వరకు రబీ కాలానికి పంట చేతికి వచ్చేవరకు రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా సాగునీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఇరిగేషన్ ఈఈ రమేష్ బాబు, డిఈ కిరణ్ కుమార్, తాహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జాతరకు వెళ్లి వచ్చే వరకు ఇల్లు గుల్ల



**అబ్దుల్లాపూర్మెట్, మహా :** జాతర స్వంత గ్రామానికి వెళ్లి.. వచ్చే సరికి ఇల్లు ఖాళీ ఘటన అబ్దుల్లాపూర్మెట్ పోలీస్స్టేషన్ పరిధిలో చోటుచేసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యాదాద్రి-భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జూలూరుకు చెందిన నీరీడు సతీష్ అబ్దుల్లాపూర్మెట్ మండలం కవాడిపల్లి గ్రామం ఉదయ గార్డెన్ కాలనీలో ఉంటూ (జూనియర్ అసిసెంట్) గా పనిచేస్తున్నాడు. ఈ మధ్యకాలంలోనే ప్రభుత్వ ఉద్యోగం వచ్చినట్లు తెలిసింది. సతీష్ స్వంత గ్రామమైనా జూలూరులో జాతర ఉండడంతో సోమవారం రాత్రి 7 గంటల సమయంలో తను ఉంటున్న ఇంటికి తాళ్లం వేసి ఊరికి వెళ్లాడు. మంగళవారం ఉదయం జూలూరు నుంచి కవాడిపల్లికి వచ్చే సరికి.. తన ఇంటి తాళ్లం పగలగొట్టి ఉండడం చూసి ఆందోళనకు గురయ్యారు. ఇంట్లోకెళ్లి చూసే సరికి.. వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువలో ఉన్న బంగారం వస్తువులు, వెండి వస్తువులు, వీటితోపాటు నగదు కూడా చోరికి గురైనట్లు తెలుసుకుని సతీష్ అబ్దుల్లాపూర్మెట్ పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అబ్దుల్లాపూర్మెట్ ఇన్స్పెక్టర్ అంజిరెడ్డి తెలిపారు.

## న్యాయం చేయాలని గుడి ముందు నిరసన



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహా :** తమకు న్యాయం చేయాలంటూ సాక్షాత్తు అమ్మవారి గుడిముందే నిరసన చేపట్టింది ఓ కుటుంబం. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో గల హనుమాన్ నగర్ మెయిన్ రోడ్ లో గల ఊర పోచమ్మ తల్లి గుడి దగ్గర గత 30 సంవత్సరాల నుండి అమ్మవారికి సేవ చేస్తున్న నిరుపేద అయిన గోపరాజు సాంబలక్ష్మి నిత్యం అక్కడ సేవలు చేస్తూ పరిసరాలను శుభ్రపరుస్తూ జీవనం కొనసాగిస్తుంది. గత మూడు రోజులుగా తనకు న్యాయం కావాలని గుడి ముందే నిరసన చేపట్టింది. ఈమధ్య కాలంలో ఈ గుడిని వేలంపాట వేయాలని ఇక్కడ నుంచి ఖాళీ చేసి వెళ్లాలని వైనాల శోభన్ బాబు, నాంపల్లి కుమార్, గోపరాజు రాజు, సేలగంటి రమేష్, ఓరుగంటి లక్ష్మి , ఓరుగంటి సమ్మయ్య అనే ఆరుగురు వ్యక్తులు బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై ఆ వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు కూడా చేయడం జరిగిందన్నారు. భూపాలపల్లిలో 31 గుడులు ఉండగా ఏ గుడికి లేని వేలం పాట, ఈ గుడికి ఎందుకని కేవలం మా మీద కక్ష సాధింపుతో , ఇక్కడి నుంచి కాళి చేపించాలనే నెపంతో మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తక్షణమే రక్షణ కల్పించి న్యాయం చేయాలని నాకు న్యాయం జరిగే వరకూ ఇక్కడ నుంచి కదిలే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు. ఈ కుటుంబానికి సిపిఐ ఎంఎల్ నాయకులు శంకర్ మద్దతు తెలుపుతూ సంబంధిత అధికారులు , కుల సంఘాలు స్పందించి ఇబ్బందులకు గురి చేయకుండా కష్టపడుతున్న వ్యక్తికి న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు.

## ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణలో ఆర్పీల సేవలు కీలకం

- నగర మేయర్ గుండు సుధారాణి



**వరంగల్, మహా ;** ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణలో ఆర్ పి ల సేవలు కీలకమని నగర మేయర్ గుండుసుధారాణిఅభిప్రాయపడ్డారు. మంగళ వారం బల్దియా ప్రధాన కార్యాలయం లో టౌన్ ప్లానింగ్ అధికారులు రిసోర్స్ పర్సన్స్ లతో ఏర్పాటు చేసిన సమావేశం లో మేయర్ పాల్గొన్న సమర్థవంతంగా నిర్వహించుటకు తగ సూచనలు చేశారు. ఈ సందర్భం మేయర్ మాట్లాడుతూ 26 ఆగస్టు 2020 కు ముందు రిజిస్ట్రేషన్ అయిన తర్వాత కచ్చా లేఔట్ చేసిన వారు, వాటిలో ప్లాట్లు తీసుకున్న ఎల్ఆర్ఎస్ కు వచ్చిన దరఖాస్తుదారులు క్రమబద్ధీకరించుకునేలా ఫోన్ ద్వారా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. రెగ్యులరైజ్ చేసుకోవడానికి 25 శాతం రాయితీతో ఈ నెలాఖరు (మార్చి 31) వరకే ప్రభుత్వం గడువు కల్పించిందని గడువు పొడగింపు ఉండదని, కల్పిస్తున్న రాయితీ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రతి ఆర్ పి 100 మంది దరఖాస్తు దారులకు ఫోన్ ద్వారా సమాచారం అందజేయాలని క్రమబద్ధీకరణ విధానాన్ని తెలియజేసి మార్చి 31 కంటే ముందుగా పేమెంట్ చేసేలా చూడాలని ప్రజలకు అవగాహన కల్పించడానికి బల్దియా ప్రధాన కార్యాలయం తో పాటు సర్కిల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేసిన దరిమిలా వాటి సేవలు వినియోగించుకోవాలని జిడబ్ల్యూ ఎంసీ కు సంబంధించిన మీ సేవా కేంద్రాల్లో కూడా చెల్లింపులు చేయవచ్చునని ప్లాట్ల క్రమబద్ధీకరణ కు దరఖాస్తు చేసుకున్న వారి మొబైల్ ఫోన్ లకు పే మెంట్ లింక్ కూడా వస్తుందని దాని ద్వారా కూడా చెల్లింపులు జరుపవచ్చునని 25% రిబెట్ అనేది చక్కని అవకాశం అని రిబెట్ పొడిగింపు ఉండదని దరఖాస్తు చేసుకున్న వారికి స్పష్టం గా తెలియజేయాలని ఆర్ పి లకు మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్ రావు, ఏ సి పి లు ఏర్షాద్, రజిత, టి ఎం సి రమేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్ లు పాల్గొన్నారు.

## సెకండరీ ట్రాన్స్ఫర్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కమిషనర్



**హన్మకొండ, మహా ;** హన్మకొండ లోని బాలసముద్రం లోని వెహికల్ షెడ్ లో గల సెకండరీ ట్రాన్స్ఫర్ స్టేషన్ ను బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే మంగళవారం క్షేత్ర స్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేసి ట్రాన్స్ఫర్ స్టేషన్ లో గల యంత్రాల పనితీరు ను పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా సెకండ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ ఏజెన్సీ ప్రతినిధుల తో చెత్త నిర్వహణ తీరు గురుంచి అడిగి తెలుసుకొంటూ యంత్రాలలో ఎంత పరిమాణంలో చెత్తను వేస్తున్నారు? ప్రతి రోజు ఎన్ని ఆటోలు స్టేషన్ కు వస్తున్నాయి? వాహనాలకు సంబంధించిన లాగ్ బుక్కులు సరిగా నిర్వహిస్తున్నారా?వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిఎంహెచ్ ఓ ను ఆదేశిస్తూ ఏజెన్సీ వారు ఖచ్చితం గా విధులు నిర్వహించేలా చూడాలని ఏజెన్సీకి చెందిన కంప్రెసర్ వాహనాలు కచ్చితంగా మూడు ట్రిప్పులు వేయాలని ట్రాన్స్ఫర్ స్టేషన్ కు ఎంత పరిమాణంలో తడి పొడి చెత్త వస్తుందని? తడి చెత్తను ఎక్కడ కంపోస్టు ఎరువుగా మార్చుతున్నారని? కంపోస్టు ఎరువు పరిమాణాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టాలని డి ఆర్ సి సి కేంద్రాలలో పొడి చెత్త పెరిగేలా చర్యలు తీసుకోవాలని వాహనాల మరమ్మత్తుల కోసం షెడ్ కు వచ్చే వాహనాలను జాప్యం లేకుండా మరమ్మత్తులు పూర్తి చేసి పంపించాలని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ఓ డా.రాజారెడ్డి, ఎంహెచ్ఓ డా. రాజేష్, ఈ ఈ మహేందర్, డిఈ శివానంద్, సానిటరీ సూపర్వైజర్ నరేందర్, ఏ ఈ సంతోష్, సానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్, ఏజెన్సీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## సైబర్ కుట్ర భగ్నం




**ఆదిలాబాద్ మహా :** సైబర్ నేరాలకు పాల్పడేందుకు సిద్ధమైన దుండగుల భారీ కుట్రను పోలీసులు భగ్నం చేశారు. ఇందుకోసం భారీగా మొబైల్ ఫోన్లు సేకరించిన ఆరుగురు పై కేసు నమోదు చేయగా... ఐదుగురు అంతరాష్ట్ర సైబర్ నేరస్తులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 2 వేల 125 పాత మొబైల్ ఫోన్లు, 107 సిమ్ కార్డులు, ఐదు బీహార్కు చెందిన బైక్స్, 600 మొబైల్ బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలను పోలీస్ హెడ్ క్వార్టర్స్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ వెల్లడించారు. సైబర్ నేరాలు చేయాలని పథకం వేసిన ఘరానా ముఠాను ఆదిలాబాద్ రెండవ పట్టణ, సైబర్ క్రైమ్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి అరెస్టు చేశారని తెలిపారు.. బీహార్కు చెందిన ఆరుగురు నిందితులు ముఠాగా ఏర్పడి దేశవ్యాప్తంగా సైబర్ నేరాలకు పాల్పడేందుకు వేసుకున్న ప్లాన్లో భాగంగా ఏ1 తబరక్ గ్యాంగ్ లీడర్గా వ్యవహరిస్తున్నాడన్నారు. మిగిలిన ఐదుగురు బీహార్ రాష్ట్రం నుండి ఐదు బైకులతో తెలంగాణ రాష్ట్రానికి వచ్చి ప్లాస్టిక్ డబ్బాలకు పాత మొబైల్ ఫోన్ల సేకరణ చేపడుతున్నారని వివరించారు. గ్రామాలు, పట్టణంలోని పలు వీధుల్లో తిరుగుతూ పాత మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, బ్యాటరీలను సేకరిస్తున్నారు. సిమ్ కార్డుల ద్వారా, ఫోన్ల ద్వారా వివిధ రాష్ట్రాలలోని ప్రజలకు బ్యాంక్ అధికారులమంటూ ఫోన్లు చేసి వారిని సైబర్ నేరం బారిన పడేవిధంగా చేసి డబ్బులు సంపాదించాలని వీరి ప్లాన్ గా తెలిపారు.ఈ కుట్రను భగ్నం చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. ఇదివరకే వీరు కర్ణాటక రాష్ట్రం నుంచి దాదాపు పది నుండి 12 వేల వరకు మొబైల్ ఫోన్లను సేకరించి వాటి ద్వారా వివిధ సైబర్ నేరాలకు పాల్పడడం జరిగిందన్నారు. సైబర్ నేరస్తుల ఈ కుట్రను చాకచక్యంగా కనుక్కొని వారిని అరెస్ట్ చేసిన పోలీసులను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో సైబర్ క్రైం డీఎస్పీ హసీబుల్లా ,డీఎస్పీ జీవన్ రెడ్డి ,టూటౌన్ సీఐ కరుణాకర్ రావు, సీసీఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## దాతృత్వాన్ని చాటుకున్న మంత్రి కొండా సురేఖ



**వరంగల్, మహా ;** రాష్ట్ర మంత్రివర్యులు కొండా సురేఖ తన దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు. సిద్దిపేట జిల్లా జనగామ అసెంబ్లీ నియోజకవర్గం చేర్యాల మండలం నాగపురి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన ప్రశాంత్ కుమారుడు నయన్ కుమార్ మాటలు రాక ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఏ హాస్పటల్ కి పోయినా 8 నుంచి 10 లక్షలు ఖర్చు అవుతుంది అని చెప్పడంతో కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సూచన మేరకు తక్షణమే వారి పరిస్థితి తెలుసుకొని కింగ్ కోటి లోని ప్రభుత్వ ఈఎన్టి ఆసుపత్రికి ఎనిమిది లక్షల రూపాయలను సీఎంఆర్ఎఫ్ ద్వారా అటవీ,పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ ఇప్పించడం జరిగింది.

## క్లాసికల్ డాన్స్ లో బిట్స్ విద్యార్థుల ప్రతిభ



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహా :** భూపాలపల్లి పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ లోని విద్యార్థులు 'రెన్ స్టార్ డాన్స్ అకాడమీ జయశంకర్ భూపాలపల్లి' వారు నిర్వహించిన క్లాసికల్ బేసిక్ కాంపిటీషన్ లో జూనియర్, సీనియర్ విభాగంలో బిట్స్ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. జూనియర్ విభాగంలో ఒకటవ తరగతి చదువుతున్న యు.వినిషా రెండవ స్థానం, మూడవ తరగతి చదువుతున్న యం.గీతిక మూడో స్థానంలో నిలిచారు. అలాగే సీనియర్ విభాగంలో నాలుగవ తరగతి చదువుతున్న ఎ. శ్రీక్షిత ఏడవ స్థానంలో నిలిచింది. గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్స్ మరియు మెడల్స్ ను అందించారు. స్థానిక ప్రిన్సిపాల్ ఎన్. రాజేష్ కుమార్ విద్యార్థులను అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.అలాగే గెలుపొందిన విద్యార్థుల తల్లిదండ్రులను అభినందిస్తూ, విద్యార్థులకు సహకరించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## నాటికలు జీవన ప్రతిబింబాలు

**తొర్రూరు, మహా ;** చైతన్య కళా సమాఖ్య ఆధ్వర్యంలో 13వ జాతీయ తెలుగు ఆహ్వానిత నాటిక పోటీలు సోమవారం రాత్రి కళావేదికలో ప్రారంభమయ్యాయి.ఈ నాటికల పోటీలను ఉమేన్స్ ఏంపవర్ మెంట్ తెలుగు అసోసియేషన్ చైర్మన్ హనుమాన్ల ఝాన్సీ రెడ్డి, తొర్రూర్ పి ఏ సి ఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, మాజీ జెడ్పిటిసి మంగళంపల్లి శ్రీనివాస్, మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ జినుగ సురేందర్ రెడ్డిలు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.అనంతరం ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ నాటికలు జీవన ప్రతిబింబాలు అని, నాటక కళకు పరిరక్షణ చేస్తున్న సమాఖ్య సేవలు ప్రశంసనీయమన్నారు.ప్రస్తుతం మహిళలు టి వి లకు సీరియల్లకు.. యువత సెల్ ఫోన్ లకు అంకితం అయ్యారని,సమయాన్ని వృధా చేయకుండా మారుతున్న మాధ్యమాలను మంచికోసం వినియోగించు కోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమం లో అతిథులు ఛాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షులు మచ్చ సురేష్ ప్రధాన కార్యదర్శి సుంకరనేని పినాకపాణి, కోశాధికారి గడల శ్రీనివాస్, పట్నం శెట్టి శ్రీశైలం, బుదారపు శ్రీనివాస్, జనార్దన్ రాజు ,ఇమ్మడి రాంబాబు, బాతుక బుచ్చిరామయ్య, కృపాల్, పెరుమాళ్ళ రవి,లేగల వెంకట్ రెడ్డి, బిజ్జల అనిల్ దొంగరి రేవతి శంకర్, గజ్జెల ఉపేంద్ర చారీ, ఏ వెంకటేశ్వర రెడ్డి, గాండ్ల వెంకన్న, ఎం వెంకన్న, జి ప్రసాద్ రెడ్డి, హమ్యానాయక్, విజయపాల్ రెడ్డి, న్యాయ నిర్ణేతలు తదితరులు పాల్గొన్నారు.

## రివార్డ్ అందుకున్న సీఐ చరమందరాజు




**హుజూర్ నగర్, మహా :** హుజూర్నగర్, గరిడేపల్లి, నేరేడుచర్ల మండలాల్లో జరిగిన వరస దొంగతనాల కేసులో చాకచక్యంగా వ్యవహరించి దొంగలను పట్టుకున్న విషయంలో జిల్లా ఎస్పీ కే. నరసింహ సూర్యాపేట జిల్లా కార్యాలయంలో సిఐ చరమంద రాజుకు రివార్డు ను అందజేశారు.

## కస్తాల శ్రవణ్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటాం



**హుజూర్ నగర్, మహా :** హుజూర్ నగర్ మాజీ కౌన్సిలర్ కాస్తాల శ్రవణ్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ అన్నారు. పట్టణ కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రావణ్ కుమార్ మరణించిన విషయాన్ని పట్టణ ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ కు చరవాణి ద్వారా సమాచారం తెలియజేయగా ఆంధ్ర ప్రాంతంలోనున్న కృష్ణ మాదిగ నేరుగా అక్కడ నుండి ఈ విషయం తెలిసిన వెంటనే హుజూర్ నగర్ కు చేరుకొని కస్తాల శ్రవణ్ కుమార్ పార్థివ దేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. ఇట్టి కార్యక్రమంలో వారు మాట్లాడుతూ శ్రవణ్ కుమార్ మరణం చాలా బాధాకరమని తమ్ముడు ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్నాడని కుటుంబం పెద్దదిక్కును కోల్పోవడం చాలా విచారకరమని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని అన్నారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని డప్పును కొడుతూ పార్థివ దేహం ముందు నడిచారు. ఇట్టి కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణం



**హుజూర్ నగర్, మహా :** మఠంపల్లి మండలం లక్ష్మినరసింహ స్వామి వారి దేవస్థానం మట్టపల్లి మహాక్షేత్రం నకు అనుబంధంగా ఉన్న శ్రీపార్వతి రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శ్రీ సుబ్రహ్మణ్యం స్వామి వారి కళ్యాణం దేవాలయ అర్చకులచే శాస్త్రోతముగా ఘనంగా నిర్వహించబడినది. అలాగే భక్తుల సౌకర్యార్థం రాబోవు వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ప్రధాన దేవాలయం వద్ద, ఇతర ప్రదేశములలో చలువ పందిర్లు వేయడం జరిగింది. ఇట్టి విషయమును దేవస్థాన అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి విజయ్ కుమార్, మట్టపల్లి రావు, కార్యనిర్వహణ అధికారి సిరికొండ నవీన్ లు తెలిపారు.

# కస్తాల శ్రవణ్ కుమార్ మరణం పట్టణ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

■ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హుజూర్ నగర్, మహా :** హుజూర్నగర్ పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ కాస్తాల శ్రవణ్ కుమార్, నిన్న జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. ఈ విషయం తెలిసిన నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి దిగ్భ్రాంతి కి గురయ్యారు. ఆయన హుజూర్నగర్ చేరుకొని కస్తాల శ్రవణ్ కుమార్ పార్థివ దేహంపై మూడు రంగుల జెండా ఉంచి, పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ శ్రవణ్ కుమార్ మరణం పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న రోజుల్లో ఆయన పార్టీకి అండగా ఉంటూ కార్యకర్తలకు వెన్నంటే ఉండి ఎన్ని కష్టాలు వచ్చినా పార్టీ కోసం పని చేశారని మంచి వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అని అలాంటి వ్యక్తి ఈరోజు మనకు దూరం అవటం చాలా బాధాకరమని అన్నారు. మరియు కస్తాల శ్రవణ్ కుటుంబాన్ని పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదేవిధంగా శ్రవణ్ కుమార్ కుటుంబానికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. పలువురు నాయకులు బంధుమిత్రులు స్నేహితులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

■ అవకాశాలను అందిపుచ్చుకుని విద్యార్థులు చదువులో రాణించాలి
■ విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేసిన కలెక్టర్




**సిరిసిల్ల, మహా :** ఉత్తమ భోధన అందించడంతో పాటు, విద్యార్థుల ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల విద్యాలయాన్ని సందర్శించి, దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. జాతీయ అంధత్వ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆర్.బి.ఎస్.కె. మొబైల్ హెల్త్ బృందాలు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, జిల్లాలో మొత్తం 2,010 మంది విద్యార్థులు దృష్టి లోపంతో బాధపడుతున్నారని నిర్ధారించారు. ఇందులో ఈరోజు జిల్లా వ్యాప్తంగా 338 కంటి అద్దాలను పంపిణీ చేయడం జరిగిందని, అవసరమైన వారికి శస్త్ర చికిత్సల కోసం హైదరాబాద్ లోని సరోజిని కంటి ఆసుపత్రికి పంపడం జరిగిందని జిల్లా కలెక్టర్ కు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.రజిత వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తమకు వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుని చదువులో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి, మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. అనంతరం దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు కలెక్టర్ కంటి అద్దాలను అందజేశారు. తదనంతరం విద్యాలయంలోని తరగతి గదులను, కిచెన్, స్టోర్ రూమ్ ను కలెక్టర్ పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే వివరాలను విద్యార్థులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తనకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులతో మాట్లాడి పరీక్షలు ఎలా రాస్తున్నారు అని అడిగారు. విద్యార్థులతో నిత్యం సాధన చేయించాలని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.సంపత్, ఆర్.బి.ఎస్.కె. ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.నయీం జహా, మెడికల్ ఆఫీసర్ కృష్ణవేణి, తదితరులు ఉన్నారు.

# కప్పలకుంట తండాలో హోలీ వేడుకలు



**మేళ్లచెరువు, మహా :** మేళ్లచెరువు మండలం కప్పలకుంట తండా గ్రామంలో హోలీ పండుగని పురస్కరించుకొని గత కొన్ని సంవత్సరాలుగా బిజెపి పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వెంకన్న ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు. నిర్వహించడం జరుగుతుంది. వెంకన్న అనే సాధారణ కూలి రైతు తన వంతు బాధ్యతగా సొంత ఖర్చులతో కోలాటం, ముగ్గుల పోటీలు, దేవాలయంకు సంబంధించి అన్నదాన కార్యక్రమం లైటింగ్ ప్రభ నృత్య డాన్స్ ఇటువంటివి హోలీ పండుగ వస్తుందంటే ఆ గ్రామంలో సందడి నెలకొంటుంది. ఈ కార్యక్రమాలు మొత్తం ఎవరి దగ్గర ఒక్క రూపాయి ఆశించకుండా తన సొంత ఖర్చులతో ఒక కూలి రైతు ఇన్ని కార్యక్రమాలు. నిర్వహించటం నిజంగా ఆ గ్రామ ప్రజలను ఆశ్చర్యపరుస్తుంది.

# సర్పంచ్ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలి



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం గోవిందపురం, గ్రామంలో సర్పంచ్ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పిర్యాదు అందించడం జరిగింది. గోవిందపురం గ్రామంలో 30 సంవత్సరాలుగా దళితులకు సర్పంచ్ ప్రాతినిధ్యం లేకుండా చేస్తూ జనాభా తక్కువ ఉన్నారు అనే భావనతో ఎన్నికల్లో సర్పంచ్ గా పోటీ చేయకుండా అడ్డుకట్ట వేస్తున్న అధికాలులను విచారణ చేసి చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వడం జరిగింది. తక్షణమే అధికారులు గోవిందపురం గ్రామం మీద దర్యాప్తు ప్రారంభించాలని అధికారులను కోరుతూ గోవిందపురం దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో శీలం శ్రీనివాస్,చంద్రయ్య,లింగయ్య,రాములు తదితరులు పాల్గొన్నారు.

# చాపల మార్కెట్ ప్రారంభం



**మోత్కూర్, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీలో చెరువుకట్ట ప్రాంతంలో కాళీ ప్రదేశంలో కొత్తగా నిర్మించిన చాపల మార్కెట్‌ను స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మందుల సామేల్ మాట్లాడుతూ,ఈ చేపల మార్కెట్ ఏర్పాటుతో చేపల వ్యాపారస్తులకు మంచి వ్యాపారం జరిగి, లాభాలు పెరుగుతాయని అన్నారు, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మున్సిపాలిటీ సహకారంతో ఈ మార్కెట్‌ను అభివృద్ధి చేశాం అని తెలిపారు. చేపల వ్యాపారం చేసే వారంతా వినియోగదారులకు నాణ్యమైన, తాజా చేపలను అందించాలని, అలా చేస్తే వినియోగదారుల నమ్మకం పెరిగి, వ్యాపారం మరింత అభివృద్ధి చెందుతుందని సూచించారు. కార్యక్రమంలో మోత్కూర్ మున్సిపాలిటీ అధ్యక్షులు, గుండగోని రామచంద్ర గౌడ్,మాజీ మున్సిపల్ చైర్మన్ కవిత లక్ష్మి నరసింహారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నూతల విమల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు, అవిశెట్టి అవిలిమల్లు, పిఎసిఎస్ చైర్మన్, వేలపుడి వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్, పన్నాల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, పురుగుల వెంకన్న, బొడ్డుపల్లి కళ్యాణ చక్రవర్తి, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. ముదిరాజ్ సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవకు అంకితమైన
# జర్నలిస్ట్ గడ్డం దశరథ




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** జిల్లాలోని, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గత 25 సంవత్సరాలుగా జర్నలిస్టు వృత్తిలో ఉంటూ, నీతి నిజాయితీగా, నిస్వార్థంతో విధులు నిర్వహిస్తు, దృఢ సంకల్పంతో ప్రజాసేవ చేస్తున్న ఇబ్రహీంపట్నం ప్రజాపక్షం దినపత్రిక విలేకరి, గడ్డం దశరథను టియుడబ్ల్యూజేఐజేయు జిల్లా ద్వితీయ మహాసభల సందర్భంగా రాష్ట్ర, జిల్లా నాయకులు శాలువతో సన్మానించి, మెమొంటోను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గత 25 సంవత్సరాలుగా జర్నలిస్టుగా కొనసాగుతున్న సందర్భంగా నా ప్రతిభను గుర్తించి ఈ మహాసభలలో సాల్వతో సన్మానించి సత్కరించినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే=ఐజేయు నాయకులు దేవులపల్లి అమర్, వై నరేందర్ రెడ్డి, విరాయత్ అలీ, సత్యనారాయణ, కే శ్రీకాంత్ రెడ్డి, సలీం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం జర్నలిస్టులు భూపాల్ రెడ్డి, సిహెచ్ మహేందర్, సిహెచ్ సదానంద్, జే పాండు, పాండురంగారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సురేందర్, బాలు, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్, శ్రీనివాస్ జిల్లాలోని జర్నలిస్టులు పాల్గొన్నారు.

# గౌస్ ఆలం ఐపీఎస్. ఆకస్మిక తనిఖీ



**కరీంనగర్, మహా :** కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని టౌన్ డివిజన్ ఏసీపీ కార్యాలయాన్ని మంగళవారంనాడు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం ఐపీఎస్ సందర్శించారు. కార్యాలయంలో గల పెండింగ్ కేసులపై సమీక్ష చేసారు. వాటికి గల కారణాలు తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలనీ సూచించారు. అర్బన్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబం దించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్నందున, వాటి బారిన పడకుండా ప్రజల్లో అవగాహన పెంచా రోడ్డు ప్రమాదాలపై చర్చించారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ హోల్స్ గా గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి రవాణా, అక్రమ ఇసుక రవాణా మరియు పి.డి.ఎస్. బియ్యం, పేకాట స్థావరాలను గుర్తించి ఆదేవారిని పట్టుకోవడం, వంటి వాటిని గుర్తించి తగిన కేసులు నమోదు చేసి, వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు వన్ టౌన్ బిల్లా కోటేశ్వర్, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ జాన్ రెడ్డి, ఉమెన్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీలత తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి




**కరీంనగర్, మహా :** ఇంటి పనులతో పాటు ఉద్యోగ బాధ్యతల్లోనూ కీలకపాత్ర పోషిస్తున్న మహిళా ఉద్యోగులు తమ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ లోని టిఎన్జీవో భవన్లో మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహించారు. ఈ క్యాంపును జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు కుటుంబ పనులతో పాటు ఉద్యోగ జీవితంలో తీరిక లేకుండా ఉంటారని అన్నారు. కచ్చితంగా వారు ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. జిల్లా యంత్రాంగం తరపున అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బిపి పరీక్ష చేయించుకున్నారు. మహిళా ఉద్యోగులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీజీవో అధ్యక్ష కార్యదర్శులు కాళీ చరణ్, రవీందర్ రెడ్డి, టీఎన్జీవో అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాస్ రెడ్డి, సంగెమ్ లక్ష్మణరావు, డిడబ్ల్యూఓ సబిత, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి రవాణా.. ఐదుగురు అరెస్ట్



**హుజూర్ నగర్, మహా :** ఆంధ్రా రాష్ట్రం కృష్ణ జిల్లాకు చెందిన A1 నింధితుడు మల్లెడ వెంకట వంశీ మరియు A2 గోకులముడి ఆనంద్ అనే వ్యక్తులు ఆంధ్ర, ఒరిస్సా బార్డర్ నుంచి గంజాయిని తక్కువకు తీసుకు వచ్చి చిన్న చిన్న పాకెట్ లు చేసి ఈ పాకెట్లను హైదరాబాద్ లో గంజాయి అలవాటు ఉన్న వారికి అమ్మి ఎక్కువ డబ్బులు సంపాదించాలని నిశ్చయించుకుని ఎన్టీఆర్ కృష్ణ జిల్లా పెనమూరు మండలానికి చెందిన A3 నింధితుడు చొరగుడి తేజ తో కలిసి విజయవాడ నుండి హైదరాబాద్ కు బస్ లో వెళ్తూ మార్గ మధ్యలో అనగా కోదాడ శివారులోని ఉన్న దుర్గాపురం ఎక్స్ రోడ్ వద్ద బస్ దిగి రోడ్ ప్రకన ఉన్న మామిడి తోట లోకి సంపత్, హేమన్ నర్సింహా సాయి, కృష్ణచైతన్య, భాస్కర్ లతో కలిసి వెళ్ళి వారికి గంజాయి త్రాగడానికి ఇస్తుండగా నమదగిన సమాచారం పై తేది 10032025 రోజున మధ్యాహ్నం 1 గంట సమయంలో కోదాడ టౌన్ ఎస్ఐ సైదులు వారిని పట్టుకున్నారు. ఇట్టి కేసులో A1 మల్లెడ వెంకట వంశీ మరియు A2 గోకులముడి ఆనంద్ అనే వ్యక్తులు పరారీలో ఉన్నారు అని ఎస్పీ తెలిపినారు. పరారీలో ఉన్న ఇద్దరు నింధితులను పట్టుకోవడానికి పోలీస్ టీమ్స్ ఏర్పాటు చేశామని ఎస్పీ అన్నారు. గంజాయి విలువ 1,00,000/ మరియు ఐదు సెల్ ఫోన్ల విలువ సుమారు 60,000/ మొత్తం విలువ 1,60,000/ రూపాయలు ఉంటుందని అంచనా వేయడం జరిగింది. గంజాయి సంబంధించిన కేసుల్లో నిందితులు అలవాటుగా ఇలాంటి నేరాలకు పాల్పడితే సామాజిక రక్షణలో భాగంగా పిడి యాక్ట్ నమోదు చేసి ఎక్కువరోజులు జైలులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం అని ఎస్పి గారు తెలిపినారు. గంజాయి సరఫరా చేసిన వినియోగించిన అది చట్టపరమైన నేరము, దీనికి సంభందించి పౌరులు, ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలి డయల్ 100 కు లేదా స్థానిక పోలీసులకు తెలుపవచ్చు, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎస్పి అన్నారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలన కోసం జిల్లా పోలీస్ శాఖ ప్రజలతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము అలాగే విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాము గంజాయి నిర్మూలనలో ప్రజలు పౌరులు అందరూ భాగస్వామ్యం కావాలని పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. సదరు నేరస్థున్ని పట్టుబడి చేసిన దాంట్లో కోదాడ టౌన్ ఎస్ఐ లు ఎస్.కె సైదులు, లింగయ్య, హెడ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాస్, వి.రామ రావు, కానిస్టేబుల్స్ సతీష్ నాయుడు, యెల్లారెడ్డి , యస్.కె ఫరీద్, శివ కుమార్ మరియు నాగేంద్ర బాబు, పర్యవేక్షణ చేసిన సిఐ టి.రాముని పోలీస్ అధికారులు ఎస్పీ అబినందించినారు.

**అరెస్ట్ చేసిన నిందితుల వివరాలు**

A3: చొరగుడి తేజ వయసు: 21 సం. వృత్తి: కార్ టెక్నీషియన్, పెనమలూరు మండలం ఎన్టిఆర్ కృష్ణ జిల్లా.
A4: ఉమ్మడిశెట్టి సంపత్ కుమార్ వయసు: 20 సం. వృత్తి: టాటా కాపిటల్ మైక్రో ఫైనాన్స్ లో లోన్ ఆఫీసర్, ఎన్టిఆర్ కృష్ణ జిల్లా.
A5: పాలపర్తి కృష్ణచైతన్య వయసు: 21సం.వృత్తి:ఎల్ అండ్ టి కంపెనీలో ఆప్రింటీస్షిప్ వర్క్, పామర్రు మండలం, ఎన్టిఆర్ కృష్ణ జిల్లా.
A6: ఖాజా నాగ వీర భాస్కర్ రావు, వయసు: 23 సం., వృత్తి: ఎల్ అండ్ టి కంపెనీలో ఆప్రింటీస్షిప్ వర్క్, విజయవాడ(అర్బన్),ఎన్టిఆర్ కృష్ణ జిల్లా.
A7: ఈడే హేమన్ నర్సింహా సాయి వయసు: 22 సం. వృత్తి: స్టూడెంట్, గుడివాడ గ్రామం మరియు మండలం, ఎన్టిఆర్ జిల్లా.

పరారీలో ఉన్న నింధితులు. A1 మల్లెడ వెంకట వంశీ పామర్రు మండలం కృష్ణ జిల్లా మరియు A2 గోకులముడి ఆనంద్ వణుకూరు గ్రామం పెనమలూరు మండలం కృష్ణ జిల్లా పరారీలో ఉన్నారు.

# భూ కబ్జాపై సరూర్ నగర్ ఎమ్మార్వోకు వినతి

■ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి



**రంగా రెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** సరూర్ నగర్ డివిజన్ లో కబ్జాకు గురి అవుతున్న సర్వే నం 24లో, రెవెన్యూ ప్లాట్‌లను రక్షించేందుకు అధికారులు చర్యల తీసుకోవాలి ఎమ్మార్వో వేణుగోపాల్ కు వినతి పత్రం అందజేసిన కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి. అనంతరం ఆమె మాట్లాడుతూ... మున్సిపల్ కార్యాలయం వెనకాల, మండల గ్రౌండ్ లో ఉన్న భూములను అక్రమంగా కబ్జా చేయడానికి కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వోను కోరినట్టు ఆమె తెలిపారు. అదే విధంగా డివిజన్‌లో అర్హులైన నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. సరూర్ నగర డివిజన్ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. గతంలో కూడా భూములు కబ్జాకు గురయ్యాయని ఫిర్యాదులో పేర్కొనడం జరిగిందని తెలిపారు. ఇట్టి విషయంపై సానుకూలంగా స్పందించిన ఎమ్మార్వో ప్రభుత్వ భూములను రక్షించేందుకు, కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన కారు



**మోత్కూర్, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలో కారు అదుపుతప్పి దూసుకెళ్లిన చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, నల్గొండ నుండి జనగాం వెళ్తున్న AP15AV7950 నంబర్ గల కారు గుండాలకు వెళ్లే రహదారిలో ప్రమాదానికి గురైంది. జమాచెట్ల బావి క్రాస్ రోడ్డు వద్ద వేగాన్ని నియంత్రించలేకపోవడంతో కారు అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. అయితే, అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణహాని జరగలేదు. స్థానికుల సమాచారం ప్రకారం, ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఒక్కరే ఉన్నారని తెలిపారు. బాధితుడు జనగాం జిల్లాకు చెందిన ఒగ్గుకథ కళాకారుడిగా గుర్తించినట్లు సమాచారం. ఘటన జరిగిన వెంటనే గ్రామస్థులు ఘటనాస్థలికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.


# సమ్మక్క సారలమ్మ జాతీయ గిరిజన యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ లక్ష్మి శ్రీనివాస్ యెడవెల్లి నియామకం



**ములుగు, మహా :** ములుగులోని సమ్మక్క సారలమ్మ జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం మొట్టమొదటి వైస్ ఛాన్సలర్ గా ప్రొఫెసర్ లక్ష్మి శ్రీనివాస్ యెడవెల్లి నియామకమయ్యారు. ఈమేరకు భారత ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ డిప్యూటీ కార్యదర్శి శ్రేయ భరద్వాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు జాతీయ గిరిజన యూనివర్సిటీ మెంటర్ అయిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కు ఆదేశాలు జారీ చేశారు. ప్రొఫెసర్ లక్ష్మి శ్రీనివాస్ హైదరాబాద్ లోని అరోరా హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ అకాడమీ ప్రొ-వీసీగా పని చేస్తున్నారు. ఆయన గిరిజన యూనివర్సిటీకి ఐదేళ్ల కాలపరిమితి లేదా ఆయనకు 70ఏళ్లు వచ్చే వరకు వైస్ చాన్సలర్ గా వ్యవహరించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, ఎస్ఎస్ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ తరగతులు ములుగు మండలం జాకారం వైటీసీలో తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు.

# అడవి జంతువుల దాడిలో ధ్వంసమైన టమాటా పంట

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** అడవి పందుల బెడదతో బెంబేలెత్తుతున్న మంచాల మండలం రైతులు. లక్షల రూపాయలలో నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు. జిల్లాలోని, మంచాల మండలం, ఆరుట్ల గ్రామానికి చెందిన మొద్దు జగన్ మోహన్ రెడ్డికి సంబందించిన వ్యవసాయ భూమిలో టమాట పంట సాగు చేస్తున్నాడు. సోమవారం రాత్రి అడవి జంతువులు (పందుల) గుంపులుగా వచ్చి టమాట పంటను పూర్తిగా ధ్వంసం చేశాయి. దాడిలో నష్టపోయిన టమాట తోటను సందర్శించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు కృష్ణమోహన్, లింగస్వామి టమాట తోటను పరిశీలించారు. దీంతో తీవ్రంగా నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. తాను టమాట పంట వల్ల పూర్తిగా నష్టపోయానని, అందుకుగాను ప్రభుత్వం నన్ను ఆదుకోవాలని అధికారులను వేడుకున్నాడు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... మంచాల మండలం ప్రాంతం అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండడంతో తరచూ అడవి జంతువులు పంటలపై పడి ధ్వంసం చేయడం జరుగుతుంది. దీంతో రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని ఇలాంటి పరిస్థితులు మునుముందు తలెత్తకుండా ఉండాలి. ఇట్లాంటి అడవి జంతువుల నుండి పంటలను కాపాడలంటే ప్రభుత్వం, రైతులకు సోలార్ ఫెన్సింగ్, సబ్సిడీ ద్వారా ఇప్పించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, దాదాపు లక్ష రూపాయల వరకు నష్టపోయిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన కోరారు. అధికారులు మాట్లాడుతూ... ధ్వంసమైన పంటకు నష్టపరిహారం రైతుకు చేకూరేలా చూస్తామని, రైతు కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇలాంటి సంఘటనలు పొలాల వద్ద జరగకుండా తగు చర్యలు చేపడతామని తెలిపారు.



## ఒకే వాహనం.. 14 కెమెరాలు, 9 రాడార్లు, 6 సెన్సార్లు


ప్రపంచం ఆటోమేషన్ వైపు వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రధానంగా ఆటోమోటివ్ విభాగంలో ఈ ఆటోమేషన్ పాత్ర కీలకంగా మారింది. ప్రస్తుతం స్వయంచాలిత డ్రైవింగ్‌కు ఆదరణ పెరుగుతోంది. దాంతో చాలా కంపెనీలు ఈ మేరకు కొత్త సాంకేతికతను వినియోగిస్తూ వాటిని పరీక్షిస్తున్నాయి. అందులో భాగంగా సెల్ఫ్ డ్రైవింగ్ కార్ల విభాగంలో జపాన్ ఆటోమోటివ్ దిగ్గజం నిస్సాన్ సంస్థ దూసుకుపోతోంది. ఇటీవల జపాన్‌లోని యోకోహామాలోని రద్దీగా ఉన్న వీధుల్లో అత్యాధునిక అటానమస్ వ్యవస్థ కలిగిన సెల్ఫ్ డ్రైవింగ్ కార్లను పరీక్షించింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన సెరెనా మినీ వ్యాన్‌ను యోకోహామా వీధుల్లో పరుగు పెట్టించింది. ఈ వాహనంలో 14 కెమెరాలు, 9 రాడార్లు, 6 లైడార్ సెన్సార్లను వాడారు. ఇవి అధిక రద్దీ ఉంటే రోడ్లపై సులువుగా ప్రయాణించేందుకు దోహదం చేస్తాయని నిర్వాహకులు తెలిపారు. మెరుగైన అటానమస్ వ్యవస్థ ఉండడంతో స్వయంగా వేగ పరిమితులను నిర్ధారించుకుంటుందని చెప్పారు. ట్రాఫిక్‌ను, అడ్డంకులను తప్పించుకుంటు ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. జపాన్‌లో వృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ కార్లు భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. రానున్న రోజుల్లో డ్రైవర్ల కొరత అధికమవుతుందని, అలాంటి వారికి కంపెనీ చేస్తున్న ఇలాంటి ఆవిష్కరణలు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. సెరెనా ప్రస్తుతం లెవల్ 2 స్వయంప్రతిపత్తితో(అటానమీ వ్యవస్థపాక్షికంగా ఆపరేట్ చేయడానికి మానవుల అవసరం ఉండడం) పనిచేస్తుండగా.. 2029 నాటికి లెవల్ 4 స్వయంప్రతిపత్తి(మానవ ప్రయేయంలేని)ని సాధించాలని నిస్సాన్ లక్ష్యంగా పెట్టుకుంది.

## 'పెట్టుబడుల కంటే ప్రధానమైనవి ఇవే..' కామత్ సూచన

పర్సనల్ ఫైనాన్స్ ప్రణాళికలు మెరుగ్గా ఉంటే భవిష్యత్తులో ఆర్థిక స్వతంత్రం సాధించవచ్చని అనుకుంటారు. దాన్ని సాధించేందుకు చాలామంది స్టాక్‌మార్కెట్ లేదా ఇతర పెట్టుబడి మార్గాలవైపు మొగ్గు చూపుతారు. కానీ జెరోధా స్టాక్ బ్రోకింగ్ కంపెనీ వ్యవస్థాపకుడు నితిన్ కామత్ మాత్రం పర్సనల్ ఫైనాన్స్ కంటే ముఖ్యమైన అంశాలపై పెట్టుబడిదారులు దృష్టి సారించాలని సూచించారు. ఇటీవల కామత్ తన బ్లాగ్‌లో స్పందిస్తూ పర్సనల్ ఫైనాన్స్ కంటే ప్రతిఒక ఇన్వెస్టర్ తప్పకుండా తెలుసుకోవాల్సిన అంశాలేంటో తెలియజేశారు. 'మీరు చేసే పెట్టుబడులు దీర్ఘకాలంలో మంచి రాబడులు అందించే అవకాశం ఉంటుంది. అందుకోసం చాలామంది స్టాక్ మార్కెట్లు, ఇతర మార్గాలను ఎంచుకుంటున్నారు. కానీ కుటుంబంలో మీపై ఆదారపడిన వారు ఉంటే ముందుగా మీరు పెట్టుబడుల కంటే జీవిత బీమాకే తీసుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అదే మీ గొప్ప పెట్టుబడి ఆలోచనవుతుంది. మీ కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడం మీ ప్రాథమిక బాధ్యత. అది చాలా అవసరం కూడా' అని కామత్ రాశారు. 'మారుతున్న జీవన ప్రమాణాలు, ఆహార అలవాట్ల దృష్ట్యా మనుషుల ఆరోగ్య సంరక్షణ ఖర్చులు పెరుగుతూ, ఆయుర్దాయం తగ్గుతోంది. ఊహించని వైద్య ఖర్చులను నిర్వహించేలా తగినంత ఆరోగ్య బీమాను ఎంచుకోండి. మీపై ఆధారపడిన వారి ఆర్థిక అవసరాలకు అనుగుణంగా మంచి టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోండి. మారుతున్న జీవన పరిస్థితులకు అనుగుణంగా కవరేజీని క్రమానుగతంగా పునఃసమీక్షించాలి. ఈ చర్యలు మీ కుటుంబానికి ఆర్థిక కష్టాల నుంచి కాపాడటమే కాకుండా మనశాంతిని అందిస్తాయి. ఫలితంగా పెట్టుబడిదారులు ఆత్మవిశ్వాసంతో తమ ఆర్థిక లక్ష్యాలను కొనసాగించడానికి ఈ విధానాలు వీలు కల్పిస్తాయి' అని తెలిపారు.

### దీర్ఘకాలిక దృక్పథంతో పెట్టుబడులు

మార్కెట్ కరెక్షన్ల సమయంలో క్రమానుగత పెట్టుబడి విధానం(సిప్)లను ఆపవద్దని కామత్ ఇన్వెస్టర్లకు సూచించారు. 'మార్కెట్ క్షీణత భయపెట్టవచ్చు, కానీ అవి దీర్ఘకాలిక సంపద సృష్టికి అవకాశాలను అందిస్తా




యి' అని తెలిపారు. క్రమశిక్షణతో ఉండటం, సిప్ కంట్రిబ్యూషన్లను నిర్వహించడం ద్వారా పెట్టుబడిదారులు దీర్ఘకాలంలో మంచి రాబడులు పొందవచ్చు. పెట్టుబడి పెట్టడానికి కంటే ముందుకు ప్రతిఒక్కరు విధిగా జీవిత, ఆరోగ్య బీమాలు తీసుకోవాలని కామత్ కోరారు.

## మూడేళ్ళలో.. రెండు లక్షల మంది కొన్న కారు ఇది

అతి తక్కువ కాలంలోనే అధిక ప్రజాదరణ పొందిన కియా కారెన్స్ అమ్మకాల్లో అరుదైన మైలురాయిని చేరుకుంది. దాని విభాగంలో అత్యంత వేగంగా అమ్ముడవుతున్న వాహనాలలో ఒకటిగా అవతరించిన ఈ కారు.. ప్రీమియం ఫీచర్స్, కొత్త డిజైన్, అప్డేటెడ్ ఫీచర్స్ పొందుతుంది. కియా ఇండియా.. కారెన్స్ కారును లాంచ్ చేసినప్పటి నుంచి, అంటే 36 నెలల్లో ఏకంగా 2,00,000 అమ్మకాల మైలురాయిని దాటేసింది. ఈ విషయాన్ని కంపెనీ అధికారికంగా ప్రకటించింది. దేశీయ మార్కెట్లో మాత్రమే కాకుండా.. కంపెనీ 70 కంటే ఎక్కువ దేశాల్లో 24064 యూనిట్ల కారెన్స్ కార్లను విక్రయించిందని స్పష్టం చేసింది. మొత్తం అమ్మకాలలో కారెన్స్ పెట్రోల్ వేరియంట్‌లు 58 శాతం వాటాను కలిగి ఉండగా, 42 శాతం కస్టమర్లు డీజిల్ వెర్షన్‌ను ఎంచుకున్నారు. 32% కొనుగోలు దారులు ఆటోమేటిక్, iMT ట్రాన్స్‌మిషన్‌లను ఎంచుకుంటున్నారు. 28 శాతం మంది కస్టమర్లు సన్‌రూఫ్‌తో కూడిన వేరియంట్‌లను ఎంచుకున్నారు. కియా కారెన్స్ ధరలు ఇండియన్ మార్కెట్లో రూ. 12.92 లక్షల నుంచి రూ. 19.95 లక్షల (ఎక్స్ షోరూమ్) మధ్య ఉన్నాయి. ఈ కారు మల్టిపుల్ వేరియంట్లలో, వివిధ ఇంజిన్ ఆప్షన్లలో లభిస్తుంది. కాబట్టి ఎక్కువమంది దీనిని కొనుగోలు చేయడానికి ఎగబడుతుంటారు. నెలవారీ (ఫిబ్రవరి) అమ్మకాల్లో సోనెట్ (7,598 యూనిట్లు), సెల్టోస్ (6,446 యూనిట్లు) మంచి వృద్ధిని సాధించాయి. కారెన్స్ గత నెలలో 5318 యూనిట్ల అమ్మకాలను నమోదు చేసింది. కంపెనీ మొత్తం సేల్స్.. 2024 ఫిబ్రవరి కంటే 23.8 శాతం ఎక్కువ. దీన్నిబట్టి చూస్తుంటే.. కియా కార్లకు ఇండియన్ మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని స్పష్టమవుతోంది.

## భారత్‌లో స్టార్‌లింక్.. ఎలాన్ మస్క్‌తో ఎయిర్‌టెల్ డీల్




**ఢిల్లీ :** ప్రముఖ టెలికాం దిగ్గజం ఎయిర్‌టెల్ శుభవార్త చెప్పింది. తన వినియోగదారులకు హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించేందుకు అపరకుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. స్పేస్‌ఎక్స్‌కు చెందిన స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవల్ని భారత్‌లో ఎయిర్‌టెల్ కస్టమర్లకు అందించనున్నట్లు ఎయిర్‌టెల్ ప్రెస్‌నోట్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా ఎయిటెల్ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ ఛైర్మన్ గోపాల్ మిట్టల్ మాట్లాడుతూ.. భారత్‌లో ఎయిర్‌టెల్ కస్టమర్లకు శాటిలైట్ ఇంటర్నెట్ సేవల్ని అందించేందుకు స్పేస్‌ఎక్స్‌తో పనిచేయడం ఓ మైలురాయి. ముఖ్యంగా కస్టమర్లకు శాటిలైట్ ఇంటర్నెట్‌ను అందించేందుకు సంస్థ కట్టుబడి ఉంది. ఎయిర్‌టెల్, స్పేస్‌ఎక్స్ ఒప్పందంలో భాగంగా ఎయిర్‌టెల్ రిటైల్ స్టోర్లలో స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవల్ని పొందేందుకు అవసరమయ్యే ఎక్విప్‌మెంట్ పొందవచ్చు. దీంతో పాటు భారత్‌లో మారుమూల ప్రాంతాల్లో పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, తదితర వాటిని కనెక్ట్ చేసేందుకు ఈ డీల్ ఉపయోగపడనుందని తెలిపారు. ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా స్టార్‌లింక్ పేరుతో శాటిలైట్ ఇంటర్నెట్ సేవల్ని అందిస్తోంది. దీంతో పాటు మొబైల్ బ్రాడ్ బ్యాండ్‌ను అందించే లక్ష్యంతో పనిచేస్తోంది. తద్వారా యూజర్లు స్ట్రీమింగ్, వీడియో కాల్స్, ఆన్‌లైన్ గేమింగ్, రిమోట్ వర్కింగ్ కార్యకలాపాలు సులభతరం కానున్నాయి.






# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# జట్కా మటన్ అంటే ఏంటి, ఎక్కడ దొరుకుతుంది?

హలాల్ గురించి మాంసం ప్రియులకు తెలిసే ఉంటుంది. ముస్లింల దుకాణాల్లో హలాల్ చేసిన మాంసాన్ని విక్రయిస్తుంటారు. అయితే గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా హలాల్ వ్యతిరేక ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలో హిందూ మాంసం దుకాణదారులను ఒక తాటిపైకి తెచ్చేందుకు ప్రయత్నం మొదలైంది. ఖాతిక్ సమాజానికి చెందిన హిందువులు నిర్వహిస్తున్న జట్కా మాంసం దుకాణాలను ప్రోత్సహించేందుకు కొత్తగా మల్హార్ సర్టిఫికేషన్ అందుబాటులోకి తెచ్చారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్ కూడా ప్రారంభించారు. మల్హార్ సర్టిఫికేషన్ కింద నమోదు చేసుకోవడానికి ఒక పోర్టల్‌ను ప్రారంభించినట్లు మహారాష్ట్ర మత్స్యకార, ఓడరేవుల శాఖ మంత్రి నితేష్‌రాణే సోమవారం ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జట్కా మటన్, చికెన్ విక్రేతలు అందరూ మల్హార్ సర్టిఫికెట్ పొందాలని ఆయన సూచించారు. హిందువులు మల్హార్ సర్టిఫికేషన్ ఉన్న దుకాణాల నుంచి మాత్రమే మటన్, చికెన్ కొనుగోలు చేయాలని సోషల్ మీడియా పోస్ట్‌లో కోరారు.

"ఈ రోజు మహారాష్ట్రలోని హిందూ సమాజం కోసం మేము ఒక ముఖ్యమైన అడుగు వేశాం. ఈ చొరవ హిందువులకు హిందూ ఆచారాల ప్రకారం లభించే జట్కా మాంసాన్ని విక్రయించే మటన్ దుకాణాలకు ప్రవేశం కల్పిస్తుంద"ని అని మంత్రి నితేష్ రాణే అన్నారు. వినియోగదారులను ధృవీకరించబడిన జట్కా మాంసం విక్రేతలతో అనుసంధానించడానికి వీలుగా MalharCertification.com అనే కొత్త వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్టు ప్రకటించారు.

### మల్హార్ సర్టిఫికేషన్ అంటే?

హిందూ మాంసం విక్రేతలందరినీ ఒకే వేదిక కిందకు తీసుకురావడానికి మల్హార్ సర్టిఫికేషన్ విధానాన్ని తెరపైకి తెచ్చారు. జట్కా మాంసం దుకాణాలను ఖాతిక్ సమాజానికి చెందిన హిందువులు మాత్రమే నిర్వహిస్తున్నారని మల్హార్ సర్టిఫికేషన్ నిర్ధారిస్తుంది. హిందువులు, సిక్కులకు హలాల్ రహిత మాంసం విక్రయించాలన్న లక్ష్యంతో దీన్ని అందుబాటులోకి తెచ్చారు. అంతేకాదు హిందూ మత సంప్రదాయాల ప్రకారం మేక, గొర్రె మాంసాన్ని శుభ్రంగా, లాలాజల కాలుష్యం లేకుండా.. మరే ఇతర జంతు మాంసం కలపకుండా విక్రయించేందుకు మల్హార్ సర్టిఫికేషన్ ఉపయోగపడుతుంది.

## మహారాష్ట్రలో వెబ్‌సైట్ ప్రారంభించిన మంత్రి
## మల్హార్ సర్టిఫికేషన్ పేరుతో వెబ్‌సైట్
### హిందువులంతా జట్కా మటన్ కొనాలని విజ్ఞప్తి




### జట్కా మాంసాన్ని ఎందుకు ఇష్టపడతారు?

హిందూ సంప్రదాయాలను పాటించే వారు జట్కా మాంసాన్ని ఇష్టపడతారు. మాంసం వినియోగానికి ఇది నైతిక పద్ధతి అని నమ్ముతారు. ఎందుకంటే జట్కా విధానంలో జంతువుకు ఎక్కువ బాధ లేకుండా వెంటనే వధిస్తారు. హలాల్ మాంసంపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో హలాల్ రహిత ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో గత సంవత్సరం నవంబర్‌లో ఎయిర్ ఇండియా.. హిందూ, సిక్కు ప్రయాణికులకు హలాల్ రహిత ఆహారాన్ని అందించి వార్తల్లో నిలిచింది. ఇప్పుడు మహారాష్ట్రలో మల్హార్ సర్టిఫికేషన్‌తో హలాల్ రహిత మాంసాన్ని విక్రయించేందుకు చొరవ చూపారు. దీనిపై మరాఠీల నుంచి ఎలాంటి స్పందన వస్తుందో వేచిచూడాలి.

### వెబ్‌సైట్‌లో ఏముంది?

జట్కా మటన్, చికెన్ విక్రేతలను ప్రామాణికంగా గుర్తించే ప్రక్రియే మల్హార్. హిందూ మతాచారాల ప్రకారమే మేక, గొర్రెలను వధించి మాంసాన్ని సంగ్రహిస్తారు. ఇది పరిశుభ్రంగా, లాలాజల రహితంగా ఉంటుంది. ఇందులో ఎటువంటి ఇతర జంతువుల మాంసం కలవదు. ఖాతిక్ సమాజానికి చెందిన హిందువులు మాత్రమే ప్రత్యేకంగా జట్కా మాంసాన్ని విక్రయిస్తారు. మల్హార్ నిర్ధారించిన దుకాణాల్లో మాత్రమే మటన్ కొనాలని మేము ప్రోత్సహిస్తున్నామని మల్హార్ సర్టిఫికేషన్ వెబ్‌సైట్ పేర్కొంది.

## అమెరికా ఉత్పత్తులపై 15% టారిఫ్‌లు ప్రకటించిన చైనా

**వాషింగ్టన్:** చైనా ఉత్పత్తులపై 20 శాతం టారిఫ్‌లు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 4న చేసిన ప్రకటనకు చైనా బదులు తీర్చుకుంది. అమెరికా వ్యవసాయోత్పత్తులు ముఖ్యంగా సోయా, బీఫ్, పోర్క్, చికెన్ ఉత్పత్తులపై అదనంగా 15 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. ఇప్పటికే మార్గమధ్యంలో ఉన్న ఉత్పత్తులపై ఈ నెల 12వ తేదీ వరకు టారిఫ్‌లను మినహాయించనున్నట్లు చైనా వాణిజ్య శాఖ తెలిపింది. ఈ ప్రకటనతో అమెరి కా పెట్టుబడిదారుల్లో భయాలు మొదలయ్యాయి. గతవారం మెక్సికో, కెనడాల దిగుమతులపై ట్రంప్ టారిఫ్‌లను విధించడం ఆయా దేశాలు అమెరికా ఉత్పత్తులపై తిరిగి టారిఫ్‌లను విధించాయి.




## రష్యాపై ఉక్రెయిన్ అతిపెద్ద డ్రోన్ అటాక్



**మాస్కో:** ఉక్రెయిన్ పై రష్యా భీకర దాడికి దిగిన కొన్ని గంటల వ్యవధిలోనే దానికి ఉక్రెయిన్ ప్రతీకారం తీర్చుకుంది. రష్యాపై అతిపెద్ద డ్రోన్ దాడి చేసింది. ఉక్రెయిన్. 337 డ్రోన్లతో ఉక్రెయిన్ మెరుపు దాడులకు దిగింది. ఈ ఘటనలో రష్యాకు చెందిన ముగ్గురు మృతిచెందగా 18 మంది తీవ్రంగా గాయపడినట్లు రష్యా వర్గాలు వెల్లడించాయి. ఉక్రెయిన్ దాడితో రష్యా అప్రమత్తమైంది. 337 డ్రోన్లలో 91 డ్రోన్లను కూల్చేసింది. ఒకవైపు శాంతి చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామంటూనే రష్యా, ఉక్రెయిన్ దేశాలు పరస్పరం మెరుపు దాడులు చేసుకుంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శాంతి చర్చలు జరిపారు. ఆ చర్చలు విఫలం కావడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చినట్లయ్యింది. రష్యా సైన్యం భీకర దాడులతో ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన సంగతి తెలిసిందే. రాజధాని కీవ్ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో పై వైమానిక దాడులకు తెగ బడింది. అయితే.. ఆ దాడుల్ని తమ దేశ వైమానిక దళం సమర్థవంతంగా అడ్డుకుంటోందని కీవ్ మేయర్ విటాలి కీచ్‌కోస్ తెలిపారు. తమకు పేలుడు శబ్దాలు ఎక్కువగా వినిపిస్తున్నాయని కీవ్(Kyiv)లోని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఆస్తి, ప్రాణ నష్టం వివరాలు తెలియరావాల్సి ఉంది. మరోవైపు.. సౌదీ అరేబియాలో ఉక్రెయిన్, అమెరికా అధికారులుశాంతి చర్చలు (జరపనున్నారు. ఈ నేపథ్యాన్ని పట్టించుకోకుండా రష్యా దాడుల ఉధృతిని పెంచింది. రెండు రోజుల కిందట ఖర్‌కీవ్ రీజియన్‌లోని డోబ్రోపిలియా నగంపై రష్యా జరిపిన క్షిపణుల దాడిలో విధ్వంసం చోటు చేసుకుంది. దాడుల్లో 14 మంది మరణించగా.. 37 మంది గాయపడ్డారు. ఈ దాడులతో రష్యా ఉద్దేశాల్లో ఎలాంటి మార్పు కనిపించడం లేదన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ.. తమ పౌరుల ప్రాణాలను రక్షించుకునేందుకు ఎంతకైనా తెగిస్తామన్నారు.

## పాక్‌లో ట్రైన్ హైజాక్..
### బందీలుగా 100 మందికి పైగా ప్రయాణికులు



**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌కు చెందిన ట్రైన్ హైజాక్ కలకలం రేపుతోంది. బలూచిస్థాన్ వేర్పాటు వాదులు పాక్ జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సుమారు మొత్తం ప్రయాణికుల్లో 100కి పైగా బంధించారు. ఆరుగురు పాకిస్థాన్ జవాన్లను హతమార్చారు. పాకిస్థాన్‌లోని నైరుతి బలూచిస్తాన్ ప్రావిన్స్‌లోని క్వెట్టా నుండి పెషావర్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వాకు తొమ్మిది బోగీలలో 450 మందికి పైగా ప్రయాణికులతో వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై వేర్పాటు వాదులు కాల్పులు జరిపారు. అనంతరం హైజాక్ చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ట్రైన్ హైజాక్‌పై బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ అధికారికంగా ప్రకటించింది. ఆ ప్రకటన మేరకు.. జాఫర్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో ప్రయాణికుల్ని హైజాక్ చేశాం. వారిలో పాక్ సైన్యం, పోలీసులు, యాంటీటెర్రరిజం ఫోర్స్ (ఏటీఎఫ్), ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ)యాక్టివ్ డ్యూటీ సిబ్బంది ఉన్నారు. వీరందరూ సెలవుపై పంజాబ్‌కు ప్రయాణిస్తున్నారు. ఈ విషయంలో పాకిస్థాన్ సైనిక జోక్యానికి ప్రయత్నిస్తే బందీలందరిని ఉరితీస్తామని హెచ్చరించింది.

# ఈ సమ్మర్ బీభత్సమే..

## క్రేజీ సినిమాలన్నీ ఈ రెండు నెలల్లోనే.!

**టాలీవుడ్ నుంచి అగ్ర హీరోల సినిమాలు విడుదల కాక రెండు నెలలు గడుస్తుంది. సంక్రాంతికి రామ్ చరణ్ గేమ్ ఛేంజర్‌తో పాటు బాలకృష్ణ డాకు మహారాజ్, వెంకటేశ్ సంక్రాంతికి వస్తున్నాం చిత్రాల తర్వాత ఒక పెద్ద సినిమా కూడా విడుదల కాలేదు. దీంతో ఈ ఏడాది చూపులన్నీ సమ్మర్ పైనే పడ్డాయి. ఎందుకంటే ఈ సమ్మర్‌లోనే స్టార్ నటుల సినిమాలు రాబోతున్నాయి. ఇందులో పవన్ కళ్యాణ్‌తో పాటు విజయ్ దేవరకొండ, నాని, నితిన్, ప్రభాస్, మంచు విష్ణు, అక్కినేని నాగార్జున తదితరులు ఈ సమ్మర్‌కి థియేటర్‌లో సందడి చేయబోతున్నారు. అయితే వీరు నటించే సినిమాలేంటో ఒకసారి చూసుకుంటే..!**

### హరిహర వీరమల్లు

నటుడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్(Pawan Kalyan) హీరోగా నటిస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ హరిహర వీరమల్లు (Hari Hara Veera Mallu). పిరియడికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాకు జ్యోతి కృష్ణ దర్శకత్వం వహిస్తుండగా.. రెండు భాగాలుగా వస్తున్న ఈ చిత్రం మొదటి పార్ట్ 'హరిహర వీరమల్లు పార్ట్: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో ప్రేక్షకుల రాబోతున్నది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. సమ్మర్‌లో వస్తున్న క్రేజీ సినిమాలలో ఈ చిత్రం ఒకటి. పవన్ కళ్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎం అయిన తర్వాత ఈ సినిమా వస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇక ఈ చిత్రం 2025 మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

### మ్యాడ్ స్క్వేర్

టాలీవుడ్ టాప్ ప్రోడక్షన్ హౌజ్ సితార ఎంటర్‌టైనమెంట్స్ నుంచి వస్తున్న తాజా ఎంటర్‌టైనర్ మ్యాడ్ స్క్వేర్ (MAD Square). "మ్యాడ్" (MAD) చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోన్న ఈ చిత్రం యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రాబోతుంది. ఈ చిత్రంలో నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, విష్ణు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కళ్యాణ్ శంకర్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాను సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తుండగా.. మార్చి 28, 2025న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే హరిహర వీరమల్లుతో పాటు రాబిన్ హుడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాలు ఒకే సమయంలో విడుదల కానుండటంతో బాక్సాఫీస్ వద్ద పోటీ ఉండే అవకాశం కనిపిస్తోంది.

### రాబిన్ హుడ్

**హీరో నితిన్, వెంకీ కుడుముల కాంబోలో వస్తున్న తాజా చిత్రం రాబిన్‌హుడ్. భీష్మ సినిమా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా.. వెన్నెల కిషోర్, రాజేంద్రప్రసాద్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. ఈ సినిమా విషయానికి వస్తే.. నితిన్ ఇందులో రాబిన్ హుడ్ అనే దొంగ పాత్రలో నటిస్తున్నాడు.**

### జాక్

'డీజే టిల్లు'(DJ Tillu), టిల్లు 2 చిత్రాలతో తనకంటూ స్టార్ హీరోగా గుర్తింపు తెచ్చుకున్నాడు సిద్ధు జొన్నలగడ్డ. అయితే సిద్ధు తాజాగా నటిస్తున్న చిత్రం జాక్ (Jack Movie). బొమ్మరిల్లు భాస్కర్ (Bommarillu Bhaskar) దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకి శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ తెరకెక్కిస్తున్నారు. స్పై థ్రిల్లర్‌గా వస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. చాలా రోజుల తర్వాత భాస్కర్ దర్శకత్వంలో సినిమా వస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి.

### ఘాటి

అగ్ర కథానాయిక అనుష్క శెట్టి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ఘాటి(Ghaati). వేదం, కంచె చిత్రాల దర్శకుడు జాగర్లమూడి కృష్ణ (క్రిష్) ఈ సినిమకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీని సమ్మర్ కానుకగా ఏప్రిల్ 18న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సినిమాలో అనుష్క ట్రైబల్ అమ్మాయి పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. భారతదేశంలోని కొండ లోయలలో నివసించే జీవితాల ఆధారంగా ఈ సినిమా రానుంది. ఇందులో అనుష్క ఒక బాధితురాలి నుంచి క్రిమినల్‌గా, అనంతరం లెజెండ్‌గా ఎలా మారింది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే.

### కుబేరా

తమిళ నటుడు ధనుష్ కథానాయకుడిగా రూపొందుతోన్న తాజా చిత్రం 'కుబేర'. క్లాసిక్ సినిమాలు దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండగా.. టాలీవుడ్ అగ్ర నటుడు అక్కినేని నాగార్జున కీలక పాత్రలో ఈ సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమా సమ్మర్ కానుకగా జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఏషియన్ సినిమాస్ అధినేత సునీల్ నారంగ్, పుస్కర్ రామ్మోహన్‌రావుతో కలిసి ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నాడు.

### కింగ్‌డమ్

**విజయ్ దేవరకొండ, జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం కింగ్‌డమ్. సితార ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. భాగ్య శ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం సమ్మర్ కానుకగా మే 30న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. విజయ్ గత చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద నిరాశపరచడంతో తన ఆశలన్నీ ప్రస్తుతం కింగ్‌డమ్ మీదే పెట్టుకున్నాడు.**

### రాజా సాబ్

పాన్ ఇండియా నటుడు ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం రాజా సాబ్ (Raaja Saab). భలే భలే మొగాడివోయ్ ఫేమ్ మారుతి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని సమ్మర్ కానుకగా ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే.





## క్రీడా వార్తలు | SPORTS NEWS



### టీ20 జట్టులో భారీగా మార్పులు

**గత సంవత్సరం జూలైలో గంభీర్ భారత జట్టు హెడ్‌కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ద్రవిడ్ పదవీకాలంలో భారతదేశం టీ20 ప్రపంచ కప్ టైటిల్‌ను సాధించింది. ఆ తర్వాత గంభీర్ బాధ్యతలు స్వీకరించాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించారు. ఈ ఫార్మాట్‌లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. హార్దిక్ పాండ్యాకు టీ20 సారథిగా నియమిస్తారని వార్తలు రాగా.. చివరి నిమిషంలో సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్సీ వరించింది. ఇది అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ నిర్ణయంతోనే టీమిండియాలో గంభీర్ శకం మొదలైంది.. సూర్యకు కెప్టెన్సీ రావడంలో గంభీర్ కీలకపాత్ర పోషించాడని ప్రచారం జరిగింది.**

# తొలి ఐసీసీ టోర్నీని నెగ్గిన గౌతమ్ గంభీర్..!

## విమర్శలకులకు సమాధానం ఇచ్చిన హెడ్‌కోచ్..!

రోహిత్ శర్మ నేతృత్వంలోని భారత జట్టు 12 సంవత్సరాల తర్వాత ఫైనల్‌లో న్యూజిలాండ్‌ను ఓడించి ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను గెలిచింది. ఎనిమిది నెలల్లోనే వరుసగా రెండో ఐసీసీ టైటిల్‌ను సాధించింది. గతేడాది జూన్‌లో దక్షిణాఫ్రికాను ఓడించి టీ20 ప్రపంచకప్‌ని నెగ్గిన విషయం తెలిసిందే. ఆ సమయంలో టీమిండియా హెడ్‌కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ ఉన్నాడు. భారత్‌ను విశ్వవిజేతగా నిలిపిన తర్వాత పదవి నుంచి వైదొలిగాడు. గౌతమ్ గంభీర్ హెడ్‌కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాడు. గంభీర్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నాడనే విమర్శలు వచ్చాయి. కోచింగ్ విధానాలపై ప్రశ్నలు లేవనెత్తారు. అతని పర్యవేక్షణలోనే టీమిండియా ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను సాధించింది.

### అజేయంగా నిలిచిన భారత్

ఎన్నో విమర్శల మధ్య టీమిండియా గంభీర్ పర్యవేక్షణలో ఛాంపియన్స్ ట్రోఫీ కోసం బరిలోకి దిగింది. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా లేకుండానే దుబాయికి చేరుకుంది. ఆస్ట్రేలియా పర్యటనలో గాయపడ్డ బుమ్రా.. కోలుకోలేకపోయాడు. దాంతో టోర్నీ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. బుమ్రా లేకపోవడంతో చాలా మంది మాజీలు సైతం భారత్ ఫైనల్‌కు చేరుతుందా? అనే సందేహాలు వ్యక్తం చేశారు. కానీ, బంగ్లాదేశ్‌పై అద్భుత విజయాన్ని నమోదు చేసిన టీమిండియా.. ఆ తర్వాత చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను మట్టికరిపించింది. న్యూజిలాండ్‌ను ఓడించి సెమీస్‌కు చేరుకుంది. సెమీస్‌లో ఆస్ట్రేలియాను మట్టికరిపించి.. ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్‌లో అటు బౌలింగ్, బ్యాటింగ్‌లోనూ రాణించి ఛాంపియన్స్ ట్రోఫీని రోహిత్ సేన గెలిచింది.

### గంభీర్ నాయకత్వంలో తొలి ఐసీసీ టైటిల్


ఛాంపియన్స్ ట్రోఫీలో తొలి రెండు మ్యాచుల్లో భారత్ తుది జట్టులో హర్షిత్ రాణాకు అవకాశంకల్పించింది. కానీ, న్యూజిలాండ్‌తో జరిగిన గ్రూప్ దశ చివరి మ్యాచ్‌లో హర్షిత్ రాణా స్థానంలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి చాన్స్ ఇచ్చింది. ఆ మ్యాచ్‌లో నలుగురు స్పిన్నర్లతో టీమిండియా బరిలోకి దిగింది. ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. అయితే, న్యూజిలాండ్‌పై విజయం సాధించడంలో స్పిన్నర్లు కీలకపాత్ర పోషించారు. వరుణ్ ఐదు వికెట్లు పడగొట్టాడు. గ్రూప్ దశలో భారత్ అజేయంగా నిలిచింది. సెమీఫైనల్స్‌లో ఆస్ట్రేలియాను ధీటుగా ఎదుర్కొంది.
2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ ఓడించిన ఆసిస్ జట్టును తాజాగా ఓడించి ప్రతీకారం తీర్చుకుంది టీమిండియా. ఈ మ్యాచ్‌కు సైతం భారత జట్టు ఎలాంటి మార్పులు లేకుండానే బరిలోకి దిగి.. అద్భుతమైన ప్రదర్శన చేసి ఫైనల్‌కు చేరింది. గత ఏడు నెలల్లో గంభీర్‌పై ఎన్నో విమర్శలు వచ్చాయి. కానీ, తన పర్యవేక్షణలోనే టీమిండియా తొలి ఐసీసీ టైటిల్‌ను సాధించడంలో విజయవంతమైంది. రాహుల్ ద్రవిడ్ స్థానంలో గంభీర్‌ని బీసీసీఐ కోచ్‌గా నియమించింది. గంభీర్ కోచింగ్ శైలి.. ద్రవిడ్‌కు భిన్నంగా ఉండడంతో.. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి సీనియర్ ఆటగాళ్లతో సంబంధాలు ఎలా ఉంటాయన్న చర్చలు మొదలయ్యాయి. కొద్దికాలంలోనే గంభీర్ నైపుణ్యం.. కోచింగ్ నైపుణ్యం, అతని సపోర్టింగ్ స్టాఫ్ విషయంలో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి.

**లంకతో విజయవంతో మొదలైనా.. వన్డేల్లో ఓటమి..**

గంభీర్ పదవీకాలం శ్రీలంక పర్యటనతో మొదలైంది. లంక పర్యటనలో భారత జట్టు మూడు టీ20లు, వన్డేలు ఆడాల్సి వచ్చింది. సూర్యకుమార్ నాయకత్వంలో భారత్ అద్భుతంగా రాణించింది. శ్రీలంకపై టీ20 సిరీస్‌ను 30తో గెలుచుకుంది. అయితే, వన్డేల విషయానికి వస్తే రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ నాయకత్వంలో టీమిండియా ఘోర పరాజయం పాలైంది. వన్డే సిరీస్‌లో లంక 20 తేడాతో టీంమిండియాను ఓడించింది. శ్రీలంక గడ్డపై జరిగిన ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో భారత్ 26 సంవత్సరాల తర్వాత తొలి సిరీస్‌ను కోల్పోయింది. వన్డే సిరీస్‌ను కోల్పోవడంతో గంభీర్‌పై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ద్రవిడ్‌తో పోలుస్తూ వచ్చారు. లంక సిరీస్ తర్వాత టీమిండియాకు నెల రోజుల విరామం దొరికింది. సెప్టెంబర్ జనవరి మధ్య భారత్ పది టెస్టులు ఆడింది. ఇందులో ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ 202325 సైకిల్‌లో ఫైనల్ చేరుకోవడం, బోర్డర్ గవాస్కర్ సిరీస్‌లు ఉన్నాయి.

### కేంద్ర క్రీడా శాఖ కీలక నిర్ణయం..

# WFIపై సస్పెన్షన్ ఎత్తివేత



కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. తద్వారా దేశీయ టోర్నమెంట్ల నిర్వహణకు, అంతర్జాతీయ టోర్నమెంట్లకు జాతీయ జట్ల ఎంపికకు రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు మార్గం సుగమం చేసింది. కాగా, WFIకి జరిగిన ఎన్నికల్లో సంజయ్ సింగ్ నేతృత్వంలోని ప్యానెల్ 2023 డిసెంబర్ 21న విజయం సాధించిన విషయం తెలిసిందే. సంజయ్ సింగ్ డబ్ల్యూఎఫ్ఐ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం అండర్ 15, అండర్ 20 జాతీయ పోటీలను ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం కేంద్ర ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించింది. రెజ్లర్లు పోటీలకు సిద్ధమయ్యేందుకు సమయం ఇవ్వకుండా ప్రకటన వెలువరించిన కారణంగా కొత్త కార్యవర్గంపై వేటు వేసింది. క్రీడా శాఖ విధివిధానాలను అమలు చేయలేదనే కారణంతో తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని 2023, డిసెంబర్ 24న క్రీడా శాఖ వెల్లడించింది. అయితే, ప్రస్తుతం దిద్దిబాటు చర్యలు తీసుకున్న కారణంగా డబ్ల్యూఎఫ్ఐపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నిర్ణయించినట్లు క్రీడా మంత్రిత్వ శాఖ పేర్కొంది.

### ఐపీఎల్-2025 ప్రారంభానికి ముందే

# లక్నో సూపర్ జెయింట్స్‌కు షాక్..!



ఐపీఎల్ 2025 ప్రారంభానికి ముందే లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. ఫాస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్ టోర్నీలో పలు మ్యాచులకు దూరమయ్యే అవకాశం ఉన్నది. మయాంక్ ఇంకా గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోలేదు. గత సంవత్సరం బంగ్లాదేశ్‌తో జరిగిన టీ20 అంతర్జాతీయ అరంగేట్రం తర్వాత వెన్నునొప్పి బారినపడ్డాడు. బెంగళూరులోని భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (BCCI) సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాసంలో ఉన్నాడు. ఇటీవలే బౌలింగ్ సాధన ప్రారంభించాడు. మయాంక్ ఎప్పుడు మళ్లీ మైదానంలో అడుగుపెడుతాడన్నదాంట్లో క్లారిటీ లేదు. కానీ, ఓ నివేదిక ప్రకారం.. ఫిట్‌నెస్ మార్గదర్శకాలను పాటించగలిగితే ఐపీఎల్ 2025 రెండో దశ వరకు లక్నో సూపర్ జెయింట్స్ తరఫున బరిలోకి దిగేందుకు ఛాన్స్ ఉంది. మయాంక్ గత కొద్ది నెలలుగా గాయాలతో ఇబ్బందిపడుతున్నాడు. గత ఐపీఎల్ సీజన్‌లో 155 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేసి మయాంక్ వార్తల్లో నిలిచాడు. గాయం కారణంగా 2023 సీజన్ నుంచి తప్పుకున్నాడు. కానీ, గత సీజన్లో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో మూడు వికెట్లు తీశాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com